16న శ్రీపొట్టిశ్రీరాములు జయంతి

నెల్లూరు (హరనాథపురం) : అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఈ నెల 16న నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటలకు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తామని తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.24

సహరి (శనివారం) : 5.02

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

1



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 14 మార్చి 2025

- వేసవిలో విద్యుత్ అంతరాయం కలగనివ్వం
- 'ఆంధ్రజ్యోతి'తో విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

'కోత'ల్లేని కరెంటుకు
ప్రత్యేక ప్రణాళిక

వేసవిలో ఎండలు మండుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కోతలు, అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేసేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

? వేసవిని ఎలా ఎదుర్కొంటారు

! వేసవిలో కరెంటు వినియోగం భారీగా పెరుగుతుంది. రానున్న రెండు నెలల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున దానిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాం. ముఖ్యంగా నగరం, పట్టణాలతో పాటు మండలకేంద్రాల్లో లోఓల్టేజీ, అధికలోడ్ ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తిస్తున్నాం. రాత్రిపూట అధికలోడ్ నమోదవుతున్న అన్ని ప్రాంతాల్లో రీడింగ్ తీయిస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడం ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నాం.

? పరికరాల కొరత ఉందా



! వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు కండక్టర్‌లు, ఇతర పరికరాల అవసరం ఎక్కువ ఉంటుంది. అవసరమైన పరికరాలను ఇప్పటికే స్టోర్‌లో ఉంచాం. దీంతో పరికరాల కొరత ఎదురయ్యే అవకాశం లేదు.

? సింగిల్ ఫేస్ లైన్ల పరిస్థితి ఏమిటి

! సింగిల్‌ఫేస్ లైన్‌తో కొంతమేర అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రాధాన్యత గత ప్రాంతాలను గుర్తించి దాదాపు 70 కి.మీ మేర త్రీఫేస్‌గా మార్చుతున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలపై లైన్‌మన్‌ల ఫోన్ నెంబర్లు రాయిస్తున్నాం. వాటికి ఫోన్ చేయవచ్చు.

? డిమాండ్‌కు తగ్గ కోటా ఉందా

! వేసవిలో వెయ్యి మెగావాట్ల విద్యుత్తు వాడకం పెరిగే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా జిల్లాకు కోటా ఉంది. కేవలం సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తప్ప వేసవిలో కోతలు ఉండవు. అలాగే సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసుకోవడం ద్వారా వేసవిలో విద్యుత్తు సమస్యను మరింతగా అధిగమించే అవకాశం కలుగుతుంది.

- నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి)

ఇంటర్వ్యూ

ఛ.. నిజంగా!


- బోగస్ పింఛన్ల వెరిఫికేషన్‌లో 'ఠాగూర్' సన్నివేశాలు
- లేని వైకల్యం ఉన్నట్టు చూపించే ప్రయత్నం
- బెడ్‌రిడన్ పింఛనుదారుల్లో 70 శాతం అనర్హులే
- కంగుతింటున్న విచారణాధికారులు
- ప్రభుత్వానికి చేరిన నివేదిక
- రాజకీయ జోక్యంతో భ్రష్టుపట్టిన మానవీయ పథకం

ఠాగూర్ సినిమా చూశారా!? అందులో హాస్పిటల్ సీన్ మీకు గుర్తుందా!? కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సంబంధించిన ఆ సీన్ ఎలా మరచిపోతారులే.

కానీ..

ఇలాంటి ఠాగూర్ సినిమాలు ఊరూరా కనిపిస్తున్నాయి. అయితే కథలో కొంచెం తేడా అంతే. ఆ సినిమాలో చనిపోయిన రోగిని బతికిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది డ్రామాలు ఆడతారు. ఇక్కడ కొంతమంది మోసగాళ్లు లేని వైకల్యం ఉన్నట్లు నటిస్తూ బోగస్ పింఛన్ల ఏరివేతకు వెళ్లిన డాక్టర్లకు నయా ఠాగూర్ సినిమాలను చూపిస్తున్నారు.

ఆ సినిమాలో చేయని చికిత్స చేస్తున్నట్లు డాక్టర్లు నటించారు. ఇక్కడ లేని రోగం ఉన్నట్లు చూపడానికి లబ్ధిదారులు నటించారు. ఎలాగైతేనేం నిజమే గెలిచింది. దొంగ నటుల గుట్టును డాక్టర్ల బృందం రట్టు చేసింది. వీరి పింఛన్ల రద్దు కోసం ప్రభుత్వానికి సిఫారసు చేసింది.



బోగస్ పింఛన్ల ఏరివేతకు నిర్ణయించుకున్న కూటమి ప్రభుత్వం తొలుత అనారోగ్యం, అంగవైకల్యం పేరుతో పింఛన్లు పొందుతున్న వారిని పరిశీలించడానికి డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందంలో జనరల్ ఫిజీషియన్ (ఎండీ), ఆర్థోపెడిక్ (ఎముకలు, కీళ్లు) డాక్టర్లను ఒక బృందంగా ఏర్పాటు చేసింది. ఒక్కో బృందానికి ఒక్కో నియోజకవర్గ పరిధిలోని పింఛనుదారుల వెరిఫికేషన్ బాధ్యత అప్పగించింది. జిల్లా పరిధిలోని తొమ్మిది నియోజకవర్గాలకు తొమ్మిది బృందాలను ఏర్పాటు చేసి విచారణకు వదిలిపెట్టింది. ఈ డాక్టర్ల బృందానికి గ్రామ సచివాలయ సిబ్బందిని సహాయకులుగా నియమించింది. లబ్ధిదారుల చిరునామాలు చూపడం వీరిపని. ఇలా మొదలైన ఈ సర్వేలో డాక్టర్లకు కనిపించిన సీన్లు ఎలా ఉన్నాయంటే!!

'బెడ్‌రిడన్' కేసులు

బెడ్‌రిడన్ కేసులంటే పూర్తిగా మంచానికే పరిమిత మైన వారు. వీరు మంచం మీద నుంచి లేవలేరు. భోజనమైనా, ఒకటైనా, రెండయినా అన్నీ మంచం మీదే. వీరి అవసరాల కోసం ఎప్పుడూ ఒక మనిషి పక్కన ఉండాలి. ఇలాంటి వారికి నెలకు రూ.15వేల పింఛను ఇస్తారు. ఇలాంటి వారు జిల్లాలో 1,274 మంది బెడ్‌రిడన్ కింద పింఛన్లు పొందుతున్నారు. నిజంగా వీరు మంచానికే పరిమితం అయ్యారా!? లేదా!? అనే పరిశీలనకు వెళ్లినప్పుడు డాక్టర్ల కళ్లకు రకరకాల నటనలు కనిపించాయి. చాలా సందర్భాల్లో విచారణకు వెళ్లిన బృందం కూడా అంతే తెలివిగా నటించి బోగస్ పింఛనుదారుల గుట్టు రట్టు చేసింది.

స్థలం.. సన్నివేశం
కావలి నియోజకవర్గం

డాక్టర్ల బృందం ఒక లబ్ధిదారుని ఇంటికి వెళ్లిన సమయంలో ఒకతను మంచం మీద కూర్చొని ఉన్నాడు.

ఇక్కడ పింఛన్లు తీసుకునేది ఎవరండి! అని అడిగారు డాక్టర్లు.

నేనే సార్.. అంటూ సమాధానం ఇచ్చాడు ఆ మంచం మీద కూర్చున్న వ్యక్తి.

నీకు పింఛను కాగితాలు, డాక్టర్ సర్టిఫికెట్లు చూపిస్తావా.. అని అడిగారు డాక్టర్లు

ఇప్పుడే ఇస్తాను ఉండండి సార్! అని గబగబాలేచి వెళ్లి కాగితాలు తెచ్చాడా లబ్ధిదారుడు

ఇంకేముంది.. అతను బోగస్ పింఛనుదారుడని, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అప్పటి డాక్టర్లు తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చారని తేలిపోయింది.

రీల్ నెం.2

ఈ ఇంట్లో పింఛను తీసుకునేది ఎవరండి అని అడిగారు డాక్టర్లు.

ఇప్పుడే బయటకు వెళ్లాడు సార్.. పిలుచుకొని వస్తానన్నాడు ఆ కుటుంబ సభ్యుడు.

రీల్ నెం.3

డాక్టర్లు విచారణకు వస్తున్నారు, మాట్లాడినా, మంచం మీద నుంచి పైకి లేచినా పింఛను ఆగి పోతుందనే సమాచా రం ముందే తెలిసిన లబ్ధిదారుడు డాక్టర్లు ఇంటికి వచ్చే సరికి గబగబ వెళ్లి మంచం మీద పడుకుంది.

వ్యవస్థలు పతనానికి పరాకాష్ట

జగన్ పాలనలో వ్యవస్థలు పతనం అయ్యాయని ప్రతిపక్ష నాయకుడి హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు చాలా సార్లు ఆరోపించారు. ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు మాటలను అప్పుడు తేలిగ్గా తీసుకున్న వారికి ఇప్పుడు పింఛన్లలో వెలుగుచూస్తున్న అనర్హుల సంఖ్యను చూసి చంద్రబాబు అన్న మాటలు నిజమే కదా అంటున్నారు. దివ్యాంగుల పింఛన్లు కావాలంటే అందుకు డాక్టర్ల సర్టిఫికెట్ (సదరన్ సర్టిఫికెట్) అవసరం. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో ఈ సర్టిఫికెట్లు ఇస్తారు. ఇంత పకడ్బందీగా ఉన్న వ్యవస్థలో ఇంత భారీ స్థాయిలో అనర్హులకు ఎలా సర్టిఫికెట్లు ఇచ్చారంటేనే వ్యవస్థ ఎంత పతనం అయ్యిందో అర్థం అవుతుంది. వైసీపీ నాయకులకు డాక్టర్లే కాదు ఏ అధికారం ఎదురు సమాధానం చెప్పే రోజులు కావవి. ఆ కారణంగానే మానవీయ కోణంతో ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పింఛన్లు రాజకీయ పార్టీల కార్యకర్తలకు జీతాలు ఇచ్చే పథకంగా మారిపోయింది.

● దివ్యాంగుల పింఛన్లలోనూ అనర్హులే

60 శాతం అంగవైకల్యం దాటిన వారు మాత్రమే దివ్యాంగుల పింఛన్లకు అర్హులు. కానీ కత్తిగాటు పడినవారు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారు.. ఇలా ఎవరు పడితే వారు దివ్యాంగులుగా పింఛన్లు తీసుకొంటున్నారు. జిల్లాలో 32,718 మంది దివ్యాంగ పింఛన్లు తీసుకొంటుండగా ఇందులో సుమారుగా 10 వేల మంది అనర్హులుగా డాక్టర్ల విచారణలో గుర్తించబడ్డారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

క్లైమాక్స్ సీన్..

"నీ పేరేమిటయ్యా అడిగాడు డాక్టర్. సమాధానం లేదు. నీకు పింఛన్ వస్తోందా!? సమాధానం లేదు. నీ వేలిముద్ర వేసుకోవాలి చెయ్యి ఇలా ఇవ్వు. ఉలుకు లేదు.. పలుకు లేదు.

డాక్టర్లకు అర్థమయ్యింది. ఇది బోగస్ అని ముందే పక్కింటి వారు సమాచారం ఇచ్చి ఉండటంతో వీరు పరీక్షలకు దిగారు. ఆర్థోపెడిక్ డాక్టర్ సంచిలోంచి కమ్మిలాంటి పరికరం తీసి పడుకొని ఉన్న అతని అరికాలి మీద గీకాడు. జివ్వు మనడంతో చాపుకున్న కాలు కాస్త సరామని వెనక్కు లాగాడు.

కాళ్లు క్లియర్ అని అర్థం చేసుకున్న డాక్టర్ చెయ్యి మడిచి మోచేతి మీద రబ్బరు సుత్తితో సున్నతంగా కొట్టాడు. చెయ్యి కండీషన్‌లోకి వచ్చేసింది. ఇంక చాలు లే లే అన్నా అనగానే ఆ లబ్ధిదారుడు లేచి కూర్చున్నాడు. నిలబడన్నా ఒక ఫొటో తీసుకుందాం అంటే లేచి నిలబడ్డాడు. ఫొటో తీసి డాక్టర్ మొబైల్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా డీసీహెచ్ఎస్ కార్యాలయానికి రిపోర్టు పంపాడు. ఇక వస్తాం అన్నా అంటూ వెనక్కు తిరిగారు.

డాక్టరు గడప దాటుతుండగా నోరు తెరిచాడా లబ్ధిదారుడు. సార్.. నా పింఛను ఉంటుందా!! ఊడుతుందా!!!!! అని

నవ్వుతూ వెళ్లిపోయారు డాక్టర్లు.

70 శాతం ఇంతే.. అంతా బోగస్సే!!

బెడ్‌రిడెన్ కింద జిల్లాలో 1,274 మంది పింఛన్లు తీసుకొంటుండగా వారిలో 70 శాతం మంది ఇలాగే అనర్హులైన లబ్ధిదారులు ఉన్నట్లు లెక్క తేలింది. 5 శాతం మంది అనారోగ్యంతో ఉన్నా బెడ్‌రిడెన్ కాదు. వికలాంగుల పింఛనుకు అర్హులవుతారు. నలుగురు ఎప్పుడో చనిపోయారు. ఇక మిగిలింది 25 శాతం మంది మాత్రమే ఈ పథకం కింద నెలకు 15వేల రూపాయల పింఛన్లకు అర్హులుగా లెక్కతేలింది.





హనుమపై రంగడి దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారానికి ఐదవ రోజుకు చేరాయి. ఉదయం వెణ్ణత్తాళి పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం విశేష పుష్పాలం కారణ, పూజలు జరిగాయి. రాత్రి హనుమంతుడిపై కొలువుదీరిన రంగనాథస్వామి భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు. ఈ సంద ర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

గృహ నిర్మాణ శాఖలో
రూ.60లక్షల అవినీతి

ఏఈ, ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై వేటు

మనుబోలు (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖలో రూ. లక్షల్లో అవినీతికి పాల్పడిన ముగ్గురు అధికారులపై కలెక్టర్ ఆనంద్ గురువారం వేటు వేశారు. 2019-24 మధ్య కాలంలో మనుబోలు మండలంలో పాత ఇళ్లకు ఇసుక, సిమెంట్, స్టీలు సరఫరా చేయడంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీనిపై కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ఆదేశాలతో గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో దాదాపు రూ.60 లక్షల మేర అవినీతికి పాల్పడినట్లు ధ్రువీకరించి నివేదికను అధికారులు కలెక్టర్‌కు అందించారు. దీంతో అప్పటి ఏఈ ఎస్.రవికుమార్‌ను, ఆయనకు సహకరించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మహేష్, మహేంద్రలను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



కౌన్సిల్ సమావేశంలో వాదులాడుకుంటున్న కార్పొరేటర్లు

నువ్వెంత..
ఆ నువ్వెంత!?

నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఎప్పటిలాగే సభ్యుల మధ్య వాగ్వివాదం, తోపులాటలతో రసాభాసగానే జరిగింది. నువ్వెంత అంటే... నువ్వెంత అంటూ టీడీపీ, వైసీపీ కార్పొరేటర్లు కూర్చున్న సీట్లలో నుంచి పైకిలేచి ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వల్ప ఉద్రిక్తతల నడుమ సాగిన సర్వసభ్య సమావేశంలో 91 అజెండా అంశాలకుగాను 89 ఆమోదించారు. అజెండాలో చేర్చినవన్నీ ముందస్తు అనుమ తులతో పనులు పూర్తి చేసి కౌన్సిల్లో పెట్టడంపై ప్రతిపక్ష కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. కాగ కాంట్రాక్టర్లకు నిలిచిపోయిన ఆర్థిక చెల్లింపులు, సచివాలయాల ఉద్యోగులకు జారీ చేస్తున్న షోకాజు నోటీసులపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై చర్చ సాగింది.

టీడీపీ, వైసీపీ కార్పొరేటర్ల వాగ్వివాదం, తోపులాట
రసాభాసగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం
91 అంశాలకు 89 ఆమోదం

నెల్లూరు(సిటీ), మార్చి13 (ఆంధ్రజ్యోతి) : అజెండా అంశాల్లో చేర్చిన అభివృద్ధి పనులపై చర్చ సాగిస్తూ అభ్యంతరాలను నివృత్తి చేయాలని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మేయర్ పొట్లూరి స్రవంతిని కోరారు. ఈ మేరకు కార్యదర్శి శ్రీలక్ష్మీ అజెండా మొదలుపెట్టగా వైసీపీ సభ్యుడు బొబ్బల శ్రీనివాస యాదవ్ జోక్యం చేసుకుని డివిజన్లలోని సమస్యలను లేవనెత్తారు. అజెండా అయ్యాకే సమస్యలు వివరించాలని రూప్ జోక్యం చేసుకోగా ఇరువురి మధ్య వాగ్వివాదంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బొబ్బలకు మరో వైసీపీ కార్పొరేటర్ నాగార్జున్ తోడవడంతో రూప్ పక్షాన టీడీపీ కార్పొరేటర్ రాజశేఖర్ జోక్యం చేసుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. ఒకానొక దశలో తమ సీట్లలోనుంచి ముందుకు దూసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తోపులాట చోటుచేసుకుంది. బయట ఉన్న పోలీసులు సైతం కౌన్సిల్ హాల్లోకి వచ్చారు. అజెండా అంశాలన్నీ పూర్తయ్యాక సమస్యలు వివరించిన 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. ఇంతలో జోక్యం చేసుకున్న వైసీపీ కార్పొరేటర్ మహేష్ తన వద్దనున్న సమస్యలు వివరిస్తానని పట్టుపట్టారు. కమిషనర్ వివరణ అయ్యాక మాట్లాడాలని కర్తం సూచించినా ఆయన వినకపోవడంతో తన సీటు నుంచి కోపంగా దూసుకుని రావడంతో మరోసారి కౌన్సిల్లో ఉద్రిక్తత నెలకొంది.

● ముందస్తు అనుమతులపై అభ్యంతరం

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో 91 అంశాలను పొందు పరిచి అందులో 89 అంశాలను ఆమోదించారు. ఇవన్నీ మేయర్ ముందస్తు అనుమతులతో పనులు పూర్తి చేసి ఆపై కౌన్సిల్ తీర్మానం కోసం అజెండాలో చేర్చారంటూ వైసీపీ కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. కౌన్సిల్లో చర్చ జరగకుండా, కార్పొరేటర్ల దృష్టికి పనులు తీసుకురాకుండా, డివిజన్లలో వాస్తవ పరిస్థితులు అధ్యయనం చేయకుండానే ర్యాడిఫికేషన్‌తో అజెండాలో చేర్చడం పురపాలక చట్టంలో లేదని, విపత్కర పరిస్థితుల్లోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలేతప్ప సాధారణ పరిస్థితుల్లో కాదని వారంతా వారించారు.

● ఆంధ్రజ్యోతి కథనాలపై చర్చ

నెల్లూరులో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు కార్పొరేషన్ నుంచి సుమారుగా రూ.45 కోట్ల వరకు బకాయిలు అందాల్సి ఉందని పేర్కొంటూ ఆంధ్రజ్యోతిలో గురువారం పరిశోధనాత్మక కథనం వెలువడింది. దీనిపై కౌన్సిల్లో ప్రస్తావనకు తీసుకువచ్చిన కార్పొరేటర్ కర్తం పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకపోతే ఎలా? అంటూ ప్రశ్నించారు. అనంతరం సచివాలయాలకు వరుస షోకాజులతో ఉద్యోగులు అల్లాడిపోతున్నారంటూ 'సర్వేలతో సతాయింపు' శీర్షికను ఆంధ్రజ్యోతిలో ఇటీవల వచ్చిన కథనంపైనా కార్పొరేటర్ బొబ్బల చర్చకు పట్టుపట్టారు. వీటిపై స్పందించిన కమిషనర్ సూర్యతేజ కాంట్రాక్టర్లకు ఆర్థిక చెల్లింపులు సిద్ధం చేస్తున్నామని, ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని బట్టి షోకాజులు నోటీసులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. 'నగరంలో ఎలాగూ మనం దోమలను నిలువరించలేము. కనీసం వాటి సైజునైనా తగ్గించండి.' అంటూ 3, 5 డివిజన్ల కార్పొరేటర్లు సంక్రాతి అశ్విని, ఓజిలి రవిచంద్ర అధికారులను కోరారు. కాగ గత ఎంహెచ్‌వో వెంకటరమణయ్యపై ఆడిట్ నివేదిక ఆధారంగా రికవరీ ఎంత వరకు చేశారని కార్పొరేటర్ బొబ్బల కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఏ ఉద్యోగికైన బదిలీ సాధారణమన్న విషయం గుర్తించాలని సూచించారు. కౌన్సిల్లో జనసేన పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ నెల్లూరులో హోటళ్లపై తనిఖీలు లేవని, తద్వారా ప్రజల ఆరోగ్యం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

● స్టడీ టూరుకు పచ్చ జెండా

దేశంలో అభివృద్ధి చెందిన నగరాలను పరిశీలించేందుకు కార్పొరేటర్లను స్టడీ టూర్‌కు తీసుకెళ్లాలని డిప్యూటీ మేయర్ రూప్ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మేయర్, కమిషనర్లు త్వరలో స్టడీ టూర్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. నగరంలో రూ.60 కోట్లతో సోలార్ ఏర్పాటు, మరో రూ.25 కోట్లతో ఎన్ఎంసీ ఖాళీ స్థలాలకు ప్రహరీల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఈ నెల నుంచి అమలు చేస్తున్న ప్లాస్టిక్‌పై నిషేధాజ్ఞలు కఠినంగా ఉంటాయని కౌన్సిల్లో తీర్మానించారు.



దేవేరులతో కలిసి తెప్పపై విహరిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

లాహిరి లాహిరి లాహిరిలో..

బిట్రగుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదవరోజు గురువారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కాగా, ఉదయం నుంచే భక్తులు తరలిరాగా, గోవిందనామస్మరణలతో కొండి మారుమోగింది. సాయంత్రం స్వామివారికి చందనాలంకరణ జరిగింది. ఆలయ ఉత్తర ద్వారం ద్వారా ఉత్సవర్లను మేళతాలాతో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. ఎంతో అందంగా తీర్చిదిద్దిన తెప్పపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. రాత్రి గజ వాహనంపై స్వామివారు ఊరేగారు.

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరెడ్డి

ఉదయగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో తప్పొప్పుల సవరణకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో తప్పిదాలను సవరించేందుకు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. బూత్‌లెవల్ అధికారుల చేర్పులు, మార్పులు జరిగినందున వారి వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. అనంతరం పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణానికి అదనపు సాయం



సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లేఅవుట్‌లలో అర్థాంతరంగా ఆగిన పక్కాగృహాల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను పూర్తిచేయాలని ఎంపీడీవో షాలెట్ సూచించారు. గురువారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్థాంతరంగా ఆగిన ఎస్సీ, చేనేత పక్కాగృహాలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75వేల చొప్పున అదనపు సాయం ప్రకటించిందన్నారు. లబ్ధిదారులను చైతన్యం చేసి ఇళ్ల నిర్మాణాలను మే నెలాఖరకు పూర్తిచేయాలని కోరారు. అదేవిధంగా కాంట్రాక్టర్లు నిర్మించే ఇళ్లను కూడా పూర్తి చేసే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గౌస్ మొహిద్దీన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వెంగమాంబ ఆలయ హుండీల లెక్కింపు



ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాల అమ్మవారి ఆలయంలో గురువారం కొరుటూరు గ్రూపు ఆలయాల కార్యనిర్వాహణాధికారి కవిత, వెంగమాంబ ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త తుమ్మల వెంకటసురేష్ బాబు, వ్యవస్థాపక ధర్మకర్తలు పచ్చవ కరుణాకర్, పచ్చవ వెంగయ్య, వేమూరి ముసలయ్యల ఆధ్వర్యంలో అమ్మవారి హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించగా రూ.10,37,020 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు అధికారులు, విశ్రాంత స్టేట్‌బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బృందం, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడు గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో గురువారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంలోని 16 సర్వే నెంబరులు 9 ఎకరాల 32 సెంట్ల ప్రభుత్వ భూమిని ఓ రైతు ఆక్రమించి సాగు చేస్తున్నాడు. దీనిపై గ్రామానికి చెందిన కొందరు గత నెలలో జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పరిశీలించిన అధికారులు ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో తిరిపాలు, సచివాలయ సర్వేయర్ పాల్గొన్నారు.

మాదాలకు ఘన నివాళులు



మాదాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మాదాల జానకిరాం జయంతి సందర్భంగా గురువారం స్థానిక అన్నపూర్ణా నగర్‌లోని రామచంద్ర నివాసంలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గొడు గులూరి రాయుడు, టీడీపీ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, గానుగపెంట రవీంద్రనాధ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నక్కలవాగు వంతెన

బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రయాణికులు



నక్కల వాగు వంతెన



వంతెనకు సపోర్ట్‌గా పెట్టిన ఇనుప దిమ్మెలు

ఏఎస్‌పేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కలవాగుపై వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దశాబ్దల క్రితం నిర్మించిన ఈ వంతెనపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు భయందోళన చెందుతున్నారు. యాత్రాస్థలమైన ఏఎస్ పేటకు విచ్చేసేవారు ఈ వంతెనపై ప్రయాణం చేయాల్సిందే. దీంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఏఎస్ పేట నుంచి హసనాపురం వేళ్లే మార్గంలో చందులూరు పాడు గ్రామ సమీపంలో ఉన్న నక్కలవాగుపై సుమారు 5 దశాబ్దల క్రితం వంతెన నిర్మించారు. ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. 8 సంవత్సరాల క్రితం ఈ వంతెన కింద ఉన్న పిల్లర్ కిందకు ఒరిగి వంతెనకు పిల్లర్‌కు మధ్య ఖాళీ ఏర్పడింది. అయినా దీనిపైనే వాహనాలు ప్రయాణించడంతో వంతెన నెర్రలు బారింది. కింద బెస్‌మెంట్ కుడా దెబ్బతిని శిథిలావస్థకు చేరడంతో వంతెనకు సపోర్ట్‌గా ఇనుప దిమ్మెలను ఏర్పాటుచేసి తాత్కాలికంగా మరమ్మతులు చేయించి అప్పటి నుంచి దాని గురించి పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరింది.

అంచనాలకే పరిమితం

నక్కలవాగుపై నూతన వంతెన నిర్మాణం దశాబ్దాలుగా అంచనాలకే పరిమితం అయింది. గతంలో తెలుగు దేశం ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం మట్టి పరీక్షలు కూడా నిర్వహించి, సుమారు రూ. 2 కోట్లకు అంచనాలు వేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో అంచనాలకే పరిమితం అయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వంతెనపై తరచూ ప్రమాదాలు

రోడ్డు వెడల్పుగా ఉండి వంతెన చిన్నగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన దారులు వాపోతున్నారు. రెండు వాహనాలు వంతెనపై ఒకేసారి రాకపోకలు సాగించేందుకు వీలు లేకపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. వంతెనపై పక్కన దిమ్మెలు లేకపోవడంతో దిచక్ర వాహనాలు, ఆటోలు వాగులో పడి పలువురు గాయాలైన సందర్భాలు ఉన్నాయి.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి



ఎస్టీ కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అయూబ్‌అప్సర్

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అయూబ్‌అప్సర్ సూచించారు. గురువారం స్థానిక ఎస్టీ కాలనీలో జరుగుతున్న వైద్య సేవలను ఆయన తనిఖీ చేశారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకారయ్య, హెచ్‌ఈ బీబీజాన్, ఆరోగ్య పర్యవేక్షకుడు ఖాజా మొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు చేయాలి

ఉదయగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం సూచించిన మెనూ పాటిస్తూ రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో షేక్ మస్తాన్ వలి సూచించారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి తగు సూచనలు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేల భారం తగ్గించండి

మర్రిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సర్వేల భారాన్ని తగ్గించాలంటూ పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎంపీడీ వోకు గురువారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు వినతిపత్రాన్ని అందజేసి, సాధారణ పనులతో పాటు నిర్ణీత గడువులు పెట్టి యాప్‌ల ద్వారా ఏర్పాటు చేసిన సర్వేలు భారంగా ఉన్నాయంటూ కార్యదర్శులు ఎంపీడీవోకు వివరించారు.

లక్ష్మీనరసింహ స్వామికి రామానుజ జీయర్‌స్వామి పూజలు



వేదపాఠశాల విద్యార్థులు, అర్చకులతో మాట్లాడుతున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

కలువాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం పరమానంద ఆశ్రమాన్ని గురువారం అహోబిల రామానుజ జీయర్ స్వామి సందర్శించారు. ఆశ్రమంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఎల్‌సీడీ స్ర్కీన్‌ను ప్రారంభించారు. ఆయన వెంట ఉభయ వేదాంతాచార్య పీఠం చైర్మన్ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి దంపతులు, వేద పాఠశాల గురువు పుష్పేంద్ర, ఆశ్రమ అర్చకులు సంపత్ కుమార్ ఆచార్యులు ఉన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరం

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ సూపరింటెండెంట్ శేషరత్న, ఆర్ఎంఓ ఉషా పేర్కొన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న అపోలో డయాలసిస్ సెంటర్‌లో మేనేజర్ సురేంద్ర ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులురెడ్డి, అపోలో మెడికల్ ఆఫీసర్ అనూష, ఆత్మకూరు నర్సింగ్ సూపరింటెండెంట్, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఏఎస్ పేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తుందని, ఇందుకు సచివాలయంలోని వెల్ఫేర్ సహాయకుల ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని గురువారం ఎంపీడీవో ప్రసన్నకుమారి ప్రకటన ద్వారా తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు వయసు గల వారు రేషన్ కార్డు, ఆదాయ, కుల పత్రాలు, ఆధార్ కార్డుతో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 75 శాతం హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిఠాపురం సభకు భారీగా తరలిన జన సైనికులు



పిఠాపురం సభకు తరలివెళ్తున్న జనసేన నాయకులు, జన సైనికులు

కలువాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం జనసేన ఆవిర్భావ సభకు కలువాయి మండలం నుంచి గురువారం జనసేన నాయకులు, జనసైనికులు బస్సుల్లో తరలివెళ్లారు. వెంకటగిరి నియోజవకర్గ సభ ఇన్‌చార్జ్ జంపాల ప్రకాష్ నాయకత్వంలో కలువాయి మండల జనసేన అధ్యక్షుడు పెరంకొండ మనోహర్ ఆధ్వర్యంలో సుంకు రామకిషోర్, శ్రీరామ్ వెంకటపతి, సుసర్ల శ్రీహరి, పువ్వాడ నరేష్, శ్రీరామ్ మనోహర్, శ్రీరామ్ నాగయ్య, వీర మహిళ తోకల ప్రవళికతో పాటు 50 మంది వెళ్లారు.

న్యూస్ బాక్స్

విద్యా సామగ్రి పంపిణీ

సీతారామపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అయ్యవారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు, ఎస్ఆర్ నగర్ ఎంపిపి స్కూల్ విద్యార్థులకు టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎస్ఆర్ నగర్‌లోని ఎష్కాల్ ప్రార్థన మందిరం ఫాదర్ సహకారంతో విద్యార్థులకు ప్యాడ్లు , పెన్నులు తదితర

అంగన్‌వాడీలకు శిక్షణ

ఉదయగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ భీ పడాయి భీ కార్యక్రమంలో భాగంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీవో సునీత మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను కార్యకర్తలు కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షేక్ షాను, సుబ్బరత్నమ్మ, రమణమ్మ, ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన మహిళలు ప్రభుత్వం అందించే కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 18-50 ఏళ్ల వయసు కలిగిన మహిళలు తెల్లరేషన్‌కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డుతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రం, కుట్టుమిషన్ అందజేయడం జరుగుతుందన్నారు. కావున అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సోమశిలలో 55.860 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 55.860 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 600, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎంపిక

ఉదయగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నపూర్ణా నగర్ బీజేపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షురాలు పాలుగుళ్ల విజయ లక్ష్మి అధ్యతన మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈసందర్భంగా మండల ప్రధాన కార్యదర్శులుగా మూలె మాధవ రెడ్డి, దగ్గుపాటి శ్రీహరి, మండల ఉపాధ్యక్షులుగా దారపనేని కేశవనారా యణ, భూపాలం కార్తీక్, కైలాసకోట సురేష్, కోశాధికారిగా బొంతల సుబ్బారావు, కార్యదర్శులుగా తోకా కుమారి, బసిరెడ్డి వైష్ణవి, సూర్యనారాయణలను ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, నారాయణరెడ్డి, గడ్డం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవిత చిన్నారులకు వాహన సదుపాయం

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న బాల భవిత కేంద్రానికి వచ్చే చిన్నారుల రాకపోకల కోసం గురువారం ఆర్‌ఎంవో ఉషా సుందరి వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల వైద్యులు, బాల భవిత కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

అగ్ని ప్రమాదంలో పూరిగుడిసెలు దగ్ధం

● రూ. 4లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలి బూడిదైన గుడిసెలు, ఆటో

మర్రిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో పూరి గుడిసెలు దగ్ధమైన సంఘటన మండలంలోని డీసీ పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా నుంచి పొగాకు పని చేసేందుకు వచ్చిన ముఠాకూలీలు రోజూ మాదిరిగా పొలాల్లోకి వెళ్లారు. ఆ సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న స్థానిక అగ్నిమాపక కేంద్రం వాహనం వచ్చే సరికే గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అందులోని నిత్యావసర వస్తువులతోపాటు 4 గ్యాస్ సిలిండర్లు పేలి పోయాయి. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేనందువల్ల ప్రాణాపాయం తప్పింది. పక్కనే ఉన్న ఆటోతో పాటు ఒక బైక్ కూడా కాలి పోయింది. ఈప్రమాదంలో సుమారు 4లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. తహసీల్దారు అనిల్‌కుమార్ తమ సొంత నిధులతో వారికి బట్టలు, ప్రతీ కుటుంబానికి 10కేజీల బియ్యం అందించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నకిలీ ఎస్ఐ అరెస్ట్

● మోసానికి పాల్పడటంతో కేసు నమోదు : డీఎస్పీ



నకిలీ ఎస్ఐ గురించి వివరిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం గ్రామానికి చెందిన యువకుడు పోలీస్ శాఖలో ఉద్యోగం రాకపోవడంతో నకిలీ ఎస్ఐగా చలామణి అవుతూ మోసానికి పాల్పడటంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వేణుగోపాల్ తెపారు. ఆమేరకు ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో నిందితుడ్ని హాజరు పరిచారు. ఆయన వివరాల మేరకు.. అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరుకు చెందిన నన్న హరీష్ అనే యువకుడు నకిలీ ఎస్ఐగా అవతారమెత్తి స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో వాహనాలు నిలిపి తనిఖీ చేస్తుండగా సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్‌లు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుడు ధరించిన పోలీస్ యూనిఫారం, బెల్టు, పోలీస్ లోగో టోపీ, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ వేమారెడ్డిని, ఎస్ఐ రాజేష్‌ను, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అత్త మృతిని తట్టుకోలేక మనస్థాపానికి గురైన ఓ వివాహిత గురువారం జాఫర్‌సాహెబ్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని మనుమసిద్ధినగర్‌లో ఎం వెంకటేశ్వర్లు, సుహాసిని(54) దంపతులు నివసి స్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. వెంకటేశ్వర్లు ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వర్లు తల్లి రంగమ్మ ఈ నెల 4వ తేదీన మృతిచెందారు. అప్పటి నుంచి సుహాసిని మానసికంగా కృంగిపోతూ అత్తను కలవరిస్తూ ఉండేది. ఈ క్రమంలో గురువారం వెంకటేశ్వర్లు దుకాణానికి వెళ్లగా సుహాసిని ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. ఆమె కనిపించడం లేదని కోడలు వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆయన తన చిన్న కుమారుడు అజయ్‌తో కలిసి భార్యకోసం గాలింపు చర్యలు చేపట్టారు. పెన్నానది సమీపంలో వెతుకుతుండగా అక్కడ కొందరు జాఫర్‌సాహెబ్ కాలువలో ఓ మహిళ దూకిందని చెప్పారు. దీంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. కాలువలో దూకింది సుహాసినిగా గుర్తించి రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధితులు గురువారం సాయంత్రం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బాలకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాలు తరలించే వాహనంపై కేసు

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలు తరలించే వాహనంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. ఈనెల 5వ తేదీన సంగం గ్రామానికి చెందిన కాకు మధుసూదన్ అనే రైతు పల్లిపాళెం రహదారిలో మోటారుబైక్‌పై యూరియా బస్తా తీసుకుని వెళ్తుండగా ఎదురుగా చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం వేగంగా వచ్చి మధుసూధన్‌ను ఢీకొనబోయింది. దీంతో మధుసూధన్ వాహనాన్ని నిలిపి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు విచారించిన పోలీసులు ఆలస్యంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

రాపూరు, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఈప్రమాదంలో రాపూరు వాసి షేక్ ముక్తార్‌కు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

సీతారామపురం, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మద్యం తాగుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ దిప్తి ఖారంత్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.



దగ్ధమవుతున్న దుర్గం కొండ



దగ్ధమవుతున్న దుర్గం కొండ

ఉదయగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం కొండ అగ్నికి ఆహుతవుతోంది. ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు ప్రాంతంలో కొండ వెనుకవైపు గురువారం గుర్తుతెలియని వ్యక్తులు పలుచోట్ల నిప్పు పెట్టడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. పొగ, మంటల వ్యాప్తికి పచ్చని చెట్లు దగ్ధమయ్యాయి. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అడువులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవారికి హనుమంత సేవ



హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కచ్చేరిమిట్టలోని శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి.రాత్రికి హోమం పూజల అనంతరం శ్రీవారు హనుమంతు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి నరహరి హరిబాబు-అమ్ములు, నరహరి సుబ్బరాయుడు - బుజ్జమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు , అర్చక బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఆగిన ఇళ్లకు అదనపు నిధులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ మాధవ తదితరులు

కొండాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): నిధులు చాలక ఆగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు నిధులు విడుదల చేస్తుందని హౌసింగ్ ఈఈ ఎస్.మాధవ అన్నారు. మండలకేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఆగిన ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. 2014 నుంచి మంజూరయిన ఇళ్ల నిర్మాణాలు, గతంలో కేటాయించిన నిధులు సరిపోక ఆగిన నిర్మాణాలకు అదనపు నిధులు ఇస్తామన్నారు. జూన్‌లో గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కావలి రూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పాలీసెట్ ప్రవేశానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలీసెట్ ఎంట్రెన్స్‌కు ఏప్రిల్ 15 తుది గడువని తెలిపారు. ఎస్సీ ఎస్టీలు రూ. 100, ఓసీ, బీసీలు రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఏప్రిల్ 30న ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9949022772, 8328095743 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు. కాగా ఏప్రిల్ ఒకటి నుంచి పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాల, రుద్రకోటలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలీసెట్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ కోత

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్ల తొలగింపు కోసం మహదేవపురం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని కొండికందుకూరు, బొడపాటివారి కొష్టాలు, శ్రీనివాసకాలనీ, మహదేవపురం, కాకిబంగారుపాలెం గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని, ఈ ప్రాంతంలోని వ్యవసాయ మోటార్లకు కూడా మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సరఫరా ఉంటుందని ఆయన తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో 12 మందికి ఉద్యోగాలు

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. మదర్‌సన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొని ఎంపికలు నిర్వహించారు. 12మంది మూడురౌండ్ల క్వాలిఫైంగ్ టెస్ట్‌లు పాసై ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టీవీ రావు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీ సురేష్, ఏవో రమేష్, ఈసీ విభాగాధిపతి వేణు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో అకడమిక్ ఆడిట్

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాలలో బోధన, అభ్యసన, పరిశోధనతో పాటు అవస్థాపన సౌకర్యాలు, విద్యార్థుల పురోగతి, పరిపాలన, హరితావరణం తదితర కార్యకలాపాలపై ఆడిట్ జరిగింది. కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టరు జయకుమారి, ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి డాక్టరు మాణిక్యరావు కళాశాలలో ఆయా అంశాలను పరిశీలించారు. పరిశోధనల్లో పురోగతి సాధించాలని వారు సూచించినట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు.

అసంపూర్తిగా సచివాలయ పనులు

● పచ్చాకు కూలీలకు ఆవాసంగా భవనం ● పాలవెల్లువ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది



మాలకొండరాయునిపాలెంలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయంలో కాపురముంటున్న పచ్చాకు కూలీలు



పాలవెల్లువ కేంద్రంలో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బంది

లింగసముద్రం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లక్రితం పనులు చేపట్టిన సచివాలయ భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. ప్రస్తుతం అది పచ్చాకు కూలీలకు ఆవాసంగా మారింది. దీంతో సచివాలయ సిబ్బందంతా గ్రామంలోని పాలవెల్లువ కేంద్రంలో పని చేస్తున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2020లో మాలకొండరాయునిపాలెం, విశ్వనాథపురం గ్రామాలకు కలిపి సచివాలయాన్ని మంజూరు చేశారు. దీంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు.అయితే ప్రభుత్వం రూ.40 లక్షలతో ఈ గ్రామానికి సచివాలయ భవనం మంజూరు చేశారు.దీంతో కాంట్రాక్టరు భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. సగం పూర్తయ్యాక ప్రభుత్వం కాంట్రాక్టరుకు రూ.25 లక్షలు విడుదల చేసింది.దీంతో నిర్మాణ పనులను మరికొంత పూర్తి చేశారు.కానీ విద్యుత్, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు ఇతర పనులు పూర్తి చేయాల్సి ఉంది.కానీ కాంట్రాక్టరుకు నిధులు విడుదల కాలేదు.దీంతో పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయి.కాగా ప్రతిఏటా ఈ గ్రామానికి వచ్చే 10, 12 కుటుంబాల పచ్చాకు కూలీలకు ఇది ఆవాసంగా మారింది.

● పాలవెల్లువ కేంద్రంలోకి మార్పు

సచివాలయ సిబ్బందిని అద్దె ఇంటి నుంచి అధికారులు ఏడాది క్రితం అదే గ్రామంలోని పాలవెల్లువ కేంద్రంలోకి మార్చారు.దీంతో ఏడుశాఖల సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. వీరంతా ఒకే గదిలో, ఒకే ఫ్యాను కింద ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం



కావలి : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మార్చి13(ఆంధ్ర జ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ఎన్నో అనర్థాలు, రోగాలు వచ్చే ప్రమాదాలు ఉన్నందున, దాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం పట్టణంలోని వ్యాపారులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తో కలిగే నష్టాలను తెలియచేస్తూ ప్రత్యామ్నాయంగా బయోడిగ్రబుల్ కవర్లు, జూట్‌బ్యాగుల వినియోగం గురించి వివరించారు. అనంతరం పాతూరు మున్సిపల్ హైస్కూల్, జడ్పీ ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులకు ప్లాస్టిక్, కాలుష్య నివారణ చర్యలపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు ప్లాస్టిక్ వినియోగంలో కచ్చితమయిన నిబంధనలు పాటించాలని కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. కమిషనర్ కార్యాలయంలో ప్రజలకు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులకు గురువారం స్వచ్ఛాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 120 మైక్రాన్‌లకు మించిన కవర్లను వినియోగించాలని, లేనిపక్షంలో రూ.2000 నుంచి రూ.5000 వరకు జరిమానా విధిస్తామని ఆయన పేర్కొన్నారు. మార్చి 15 నుంచి ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం-1 కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెదకొండూరులో భూ వివాదంపై వాగ్వాదం



క్లియరెన్స్ పనులు అడ్డుకుంటున్న కాలనీ వాసులు

కలిగిరి, మార్చి 13(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెదకొండూరులో భూవివాదంపై గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు, పెదకొండూరు సర్వే నెం760-1రులో 3.54 ఎకరాల్లో గతంలో తమకు ఇళ్లపట్టాలుగా మంజూరు చేసినట్లు, తమ పూర్వీకులు అక్కడ నివాసం ఉన్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. గ్రామానికి ఆ ప్రాంతం దూరంగా ఉండటంతో అక్కడ నివాసం ఉండటానికి ఎవరూ వెళ్లకపోవడంతో అక్కడ చిల్లచెట్లు పెరిగిపోయాయి. కానీ భూమి ఫెయిర్ అడంగల్ రికార్డు ప్రకారం పట్టాభూమిగా నమోదై ఉండటంతో సంబంధీకులు ఆన్‌లైన్ ఎక్కించుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. ఆ భూమిలో గురువారం క్లియరెన్స్ పనులు చేపట్టడంతో కాలనీవాసులు అడ్డుకోవడంతోపాటు విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై శుక్రవారం రెవెన్యూ కోర్టు నిర్వహిస్తామని, ఇరువర్గాలు రికార్డులతో తహసీల్దారు కార్యాలయానికి చేరుకోవాలని, రికార్డులు పరిశీలించాక భూమిపై నిర్ణయం తగిన విధంగా తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దారు రవీంద్రబాబు తెలిపారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమ్య

కావలి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో వచ్చే ప్రాణాంతక వ్యాధి తలసేమియా వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్. రమ్య తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌లోని సర్వేపల్లి రాధాక్రిష్ణన్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం తలసేమియా వ్యాధిపై అవగాహన, ఉచిత రక్తగ్రూపుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం ఎం. సుగుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రమ్య మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నెలల వ్యవధిలోనే బయటపడే ఈ వ్యాధి వల్ల పిల్లల ఆరోగ్యపరిస్థితి దయనీయంగా మారుతోందన్నారు. తలసేమియా వ్యాధి ఉన్నపిల్లలకు అండగా ఉండేందుకు కావలి రెడ్‌క్రాస్‌లో డేకేర్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డేకేర్ సెంటర్ కన్వీనర్ కే. హరినారపరెడ్డి, డాక్టర్ మదన్, టీమ్ సేవియర్స్ ప్రణీత, ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను కేంద్రాలకు తరలించండి



ముత్యాలపాడులో చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు

లింగసముద్రం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని తడి,పొడి చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు.గురువారం ఆయన చినపవని, పెదపవని, ముత్యాలపాడు గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కేంద్రాల్లో తయారైన వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించాలన్నారు.అనంతరం ఆయన ఆయా సచివాలయాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.ప్రజల నుంచి వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు.సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.అనంతరం ఆయన లింగసముద్రంలో సిబ్బంది చేస్తున్న ప్రభుత్వ సర్వేలను పరిశీలించారు.

వసతిగృహం ఆధునికీకరణకు రూ.3.3 కోట్లు

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహం ఆధునికీకరణకు పీఎం అజయ్ పథకం కింద రూ. 3.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అధునాతన సౌకర్యాలతోపాటు నూతన భవనాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ఆధునిక వంటశాల, ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ద్వారా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేసిన కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయి.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొండాపురం, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఈ విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కొక్క గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 17 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. మెరిట్ ప్రకారం ప్రవేశాలు ఉంటాయని వివరించారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. మేకపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశం కోసం ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన వారంతా ఇంటర్‌లో చేరేందుకు అర్హులని, ఈనెల 17 నుంచి మే 25 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.వివరాలకు 8106433746, 7986375798 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

కందుకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన రచయిత్రి మొల్లమాంబ జయంతిని గురువారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన సంఘం నాయకులు మాట్లాడుతూ మొల్లమాంబ రచనల గొప్పదనం గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అద్దంకి సుబ్బారావు, కలికివాయి కృష్ణ, ఆముదాలపల్లి మాల్యాద్రి, ఉప్పుటూరి వెంకయ్య, ఉప్పుటూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఇంటింటికీ..

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి) ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నామని సీపీఎం పట్టణ కార్యదర్శి పీ. పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం వెంగళరావునగర్‌లో పర్యటించి, సమస్యలు గుర్తించి స్థానిక సచివాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో ఏమూలకు పోయినా దోమలు, పందులు, ముందుకు కదలని మురుగు, కుక్కల బెడద సమస్యలు విపరీతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు..

● చిన్ని యశోవర్ధన్



చిన్ని యశోవర్ధన్‌ను సత్కరిస్తున్న సాయి భక్తమండలి సభ్యులు

కావలి, మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, చదువుకునే వయసు నుంచి ఓ ప్రణాళికతో ముందుకు వెళితే విజయం తప్పక వరిస్తుందని వై.సీ వెంటోరియస్ గ్రూప్ సీఈవో చిన్ని యశోవర్ధన్ తెలిపారు. స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో గురువారం సాయి భక్త మండలి ఆధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత గడ్డ నెల్లూరుపై ఉన్న అభిమానంతో నెల్లూరు ఇండస్ట్రీయల్ జోన్‌లో గ్రీన్ టెక్నాలజీ ఉపయోగించుకోవాలనే కోరికతో టెర్రినోవా గ్రీన్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని స్థాపించి, ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించానన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలి సభ్యులు అనుమలశెట్టి రామక్రిష్ణ, జీపీఎస్ ప్రసాద్, కేపీఎన్ కుమార్, కేవీ క్రిష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

కావలిటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో గురువారం పేద మహిళకు పోలిశెట్టి శ్రీనివాసులు, సునీత దంపతులు కుట్టుమిషన్ అందించారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు మాట్లాడుతూ పేద మహిళకు కుట్టు మిషన్ అందించడం ద్వారా ఆ కుంటుంబం ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి బ్రిడ్జికి మహర్దశ

● వైసీపీ పాలనలో అష్టకష్టాలు
● కూటమి పాలనలో తొలగిన వైనం

కావలి,మార్చి13(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెనకు మహర్దశ పట్టింది. గుంతలు మిట్టలుగా ఉన్న తారురోడ్డుతో ప్రజలు అవస్థలు పడుతుండగా, దానిపై తారు రోడ్డు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించారు. అలాగే వంతెన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ కూడ దెబ్బతిని పాదచారులకు ఇబ్బందికరంగా మారగా, వాటిని కూడా తొలగించి చదును చేయటానికి సిద్ధమవుతున్నారు. అది కూడా పూర్తి అయితే ఉదయగిరి బ్రిడ్జిపై వాహనచోదకులతోపాటు, పాదచారుల కష్టాలు పూర్తిగా తొలగనున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు, వాహనచోదకులు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే వంతెన మార్గంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వాహనాలు రయ్..రయ్ మంటూ తిరుగుతున్నాయి.ఫుట్‌పాత్ నిర్మాణం కూడా చేపట్టడంతో త్వరలో పాదచారుల సమస్యలు కూడా తొలగనున్నాయి.



వంతెనపై కొత్తగా వేసిన తారురోడ్డు

వీవీపాలెంలో తరచూ గొర్రెల చోరీ

● ఇప్పటివరకు పదుల సంఖ్యలో అపహరణ ● ఆందోళనలో పెంపకందారులు

వలేటివారిపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో గుర్తు తెలియని దుండగులు గొర్రెలను అపహరించుకు పోతున్నారు. దీంతో పెంపకందారులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. పగలంతా మండుటెండలో గొర్రెలను మేపుకొని, రాత్రికి దొడ్లో తోలి నిద్రిస్తున్న సమయంలో దొంగలు గొర్రెలను అపహరించుకుపోతున్నారు. వారం వ్యవధిలో అయ్యవారిపల్లెకి చెందిన దండెబోయిన వేణుకు చెందిన 25 గొర్రెలను దుండగులు అపహరించుకపోయాయి. ఇది జరిగిన రెండు రోజులకే చుండిలో గొర్ల పున్నయ్యకు చెందిన 20 గొర్రెలను, ఓ పొట్టేలును దుండగులు అపహరించుకపోయారు. ఈ చోరీ జరిగిన జరిగిన మరుసటిరోజే కూనిపాలెంనకు చెందిన మిత్తుకుళ్ల శ్రీనివాసులుకు చెందిన 8 గొర్రెలు, ఒక పొట్టేలను దుండగులు చోరీ చేశారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని గొర్రెల పెంపంకందారుల్లో ఆందోళన నెలకొంది. చోరీకి గురైన గొర్రెలు విలువ సుమారు రూ.10 లక్షలకు పైగానే ఉంటుందని పెంపకందారులు చెబుతున్నారు. దుండగులను గుర్తించి వెంబడిస్తే మోటారుబైకులపై దొరక్కుండా వెళ్తున్నట్లు గొర్రెల పెంపకందారులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయం పోలీసులకు చెబితే ఆ దొంగలను పట్టుకురండి... చర్యలు తీసుకొంటాం... లేదా మీరే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి. అప్పుడు సులభంగా దొంగలను పట్టుకోవచ్చని అంటున్నారు. ఈ క్రమంలో పెంపకందారులంతా మూకుమ్మడిగా కలెక్టర్ వద్దకు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

మిల్లర్లూ.. రైతులను ఆదుకోండి !



అల్లూరు : సమావేశంలో మాట్లాడుతున్న బీద గిరిధర్, చిత్రంలో తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు

అల్లూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి): మిల్లర్లంతా రైతులకు సహకరించి ధాన్యం కొనుగోలు చేయాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరులో గురువారం రైతులు, మిల్లర్లకు ధాన్యం కొనుగోలుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 17 శాతం తేమ కంటే ఎక్కువగా ఉండే ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని మిల్లర్లను కోరారు. కిలో చొప్పున అదనంగా ధాన్యాన్ని 18 శాతం తేమ ఉంటే కొనుగోలు చేయాలని, 19 శాతం ఉంటే మరో కిలో అదనంగా తీసుకోవాలన్నారు. మిల్లర్లు స్పందిస్తూ ఆ విధంగా తాము సేకరణ చేయలేమని, మరింత అధికంగా ధాన్యం ఇస్తే కొనుగోలు చేస్తామన్నారు. దీంతో రైతులు మిల్లర్ల మధ్య రసాభాస నెలకొంది. ఈ విషయంపై జాయింట్ కలెక్టరును సంప్రదించి, సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్తామని చెప్పి సభను ముగించారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


● దళారుల ప్రమేయం లేకుండా కొనుగోళ్లు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్నీ చర్యలు చేపట్టామని రాష్ట్ర సివిల్‌సప్లై డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పండించిన ధాన్యం కొనుగోలు చేసి రైతు వాట్సప్ ద్వారా అన్నీ వివరాలు అందచేస్తామన్నారు. రైతుకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, అమ్మిన ధాన్యం నగదు 24 గంటల్లో వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, సివిల్ సప్లై అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మనుబోలు: హైవేపై లైట్ల వెలుగుల్లో వాహనాల రాకపోకలు

రాపూరు: పెంచలస్వామి ఆలయాన్ని కప్పేసిన మంచు



ఎనిమిదైనా.. ఎండ రాదే!

మార్చిలోనూ మంచు ఎఫెక్ట్!

సమయం ఉదయం ఎనిమిది కావస్తోంది. అయినా మంచు దుప్పటి వీడలేదు. భవనాలు, రోడ్లు, పొలాలు, కాలువలు ఇలా అన్నిటినీ మంచు కప్పేసింది. దీంతో రహదారులపై వాహనాలు లైట్ల కాంతిలో రాకపోకలు సాగించాయి. శివరాత్రి దాటాక చలి తగ్గినా.. మంచు మాత్రం మార్చి నెల సగం గడిచినా వీడలేదు. దీంతో కోతల దశల్లో ఉన్న పైర్లకు తెగుళ్ల బాధ తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇక రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలో లక్ష్మీనృసింహ హుండి ఆలయాన్ని మంచు కప్పేసింది. ఉదయం 9 గంటల వరకు మంచు పెంచలకోన క్షేత్రాన్ని కనువిందు చేసింది.

- మనుబోలు/సంగం/రాపూరు



సంగం : పొలాల్లో దట్టంగా వ్యాపించిన పొగ మంచు

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలలో 43 మంది విద్యార్థులకు గాను 36 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలలో 8217 మంది విద్యార్థులకు గాను 7717 మంది హాజరయ్యారు. కాగా, నెల్లూరులోని జెనెస్ విజన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

టెన్త్ ఇన్విజిలేషన్ బాధ్యత ఎస్ఏలదే!

- బాలికల కోసం మహిళా ఇన్విజిలేటర్లు
- పరీక్షల నిర్వహణపై శిక్షణ

నెల్లూరు(విద్య), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లను నియమిస్తున్న ట్లు జిల్లా అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది ఎస్ఏలకే పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నామని, దీనికోసం నిబద్ధత, విలువ లు కలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఆరోపణలు ఉన్నవారిని, విధులు సక్రమంగా నిర్వహించని వారికి బాధ్యత లు అప్పగించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమిస్తున్నామన్నారు. ఈ మేరకు కసరత్తు పూర్తయిందని తెలిపారు. అలాగే ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకుల సంఖ్యను కూడా పరిగణలోకి తీసుకుని నియామకాలు చేపడుతున్నారు. బాలికల ను పరీక్షించేదుకు ప్రతి కేంద్రానికి ఒకరు లేదా ఇద్దరు మహిళా ఇన్విజి లేటర్లను నియమిస్తున్నారు. వీరందరికీ ఇప్పటికే శిక్షణ అందించగా, పరీక్షల సమయం ఆసన్నమవుతుండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహించాల్సిన బాధ్య తలపై సమావేశాలు నిర్వహిస్తూ సంసిద్ధులను చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ప్రజల్లారా.. పట్టాలు అందుకోండి!

- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం
- 150 గజాల్లోపు ఉంటే ఉచితంగా పట్టా
- నగరంలో వేలాదిమంది పేదలకు ఉపయోగం
- అపోహలతో వెనకడుగు వేస్తున్న అర్హులు

నెల్లూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకొని ఉన్నా చాలా మంది పేదలు పట్టాలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఎప్పుడొచ్చి ఇళ్లను ఖాళీ చేయమంటారోనని కంటిమీద కునుకు లేకుండా జీవిస్తున్నారు. అలాంటి వారికి ప్రభుత్వం శుభవార్త అందించింది. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజేషన్ ద్వారా పట్టాలు అందించాలని నిర్ణయించింది. 2019, అక్టోబరు 15వ తేదీకి ముందు ఇళ్లు నిర్మించుకున్న వారందరినీ అర్హుల జాబితాలోకి చేర్చింది. ఇటువంటి వారు నెల్లూరు నగరంలో వేల మంది ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. వీరందరూ స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు, ఇంటిపన్ను, నీటి పన్ను వంటి ఆధారాలను చూపిస్తే వాటిని పరిశీలించాక అధికారులు అర్హులని తేలితే పట్టా మంజూరు చేస్తారు. అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మాత్రమే ఈ రెగ్యులరైజేషన్ పథకం వర్తిస్తుంది. లేఅవుట్‌లో ఓపెన్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ ప్రాంతాలు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లోని నిర్దేశిత స్థలాలు, జలవనరులకు సంబంధించిన ఇతర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటే అటువంటి వాటిని క్రమబద్ధీకరించరు. 150 చదరపు గజాల్లోపు ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి ఎటువంటి చార్జీలు లేకుండా ఉచితంగా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేసి పట్టాను అందిస్తారు.



150 గజాలకుపైగా..

అయితే ఆపైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి కూడా ప్రభుత్వం ఒక అవకాశం కల్పించింది. ఈ స్థలాలను కూడా నిర్ణీత రుసుమును కట్టించుకొని క్రమబద్ధీకరించనున్నారు. దారిద్ర్య రేఖకు దిగువున ఉండి 150 నుంచి 300 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉంటే అటువంటి వారు భూమి బేసిక్ ధరలో 15 శాతం చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం భరించాలి. ఈ కేటగిరిలో దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. 300 నుంచి 450 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని ఉన్న బీపీఎల్ కుటుంబాలు భూ విలువలో వంద శాతం చెల్లించడంతోపాటు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు కూడా చెల్లించాలి. అదే ఉన్నత వర్గాలకు చెందిన వారు భూ విలువలో 200 శాతం చెల్లించడంతోపాటు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజును భరించాల్సి ఉంటుంది. ఇక 450 గజాలకు మించి ఎవరు ఆక్రమణలో ఉన్నా బేసిక్ ధరకు ఐదు రెట్లు కట్టడంతో పాటు వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించాలి. క్రమబద్ధీకరించి పట్టా అందించిన రెండేళ్ల తర్వాత వీరికి యాజమాన్య హక్కులు లభిస్తాయి. నెల్లూరులోనే ఎక్కువగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని ఉన్నారు. ఇటువంటి వారందరికీ ఈ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఎంతో మేలు చేస్తుంది. అయితే ప్రభుత్వం మంచి అవకాశాన్ని ఇచ్చినా.. కొన్ని అపోహలతో పేదలు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి నెల రోజులు దాటినా ఇప్పటికి నెల్లూరు నగర పరిధిలో పదికి మించి దరఖాస్తులు రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే ఎవరూ ఎటువంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు చేసుకోండి

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించు కొని ఉన్న పేదలకు ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించింది. వారు ఆక్రమించుకొని ఉన్న స్థలాన్ని క్రమబద్ధీకరించుకొని పట్టా పొందేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎటువంటి అపోహలకు పోకుండా 2019 అక్టోబరు 15కు ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారు స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- లాజరస్, నెల్లూరు రూరల్ తహసీల్దార్

భూ సమస్యలపై సంయుక్తంగా సర్వే చేయండి

- అటవీ, రెవెన్యూ శాఖల సమీక్షలో కలెక్టర్ ఆనంద్



అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడు తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వ రపురం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అనేక భూసమస్యలపై అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో గురువారం అటవీ, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. భూ వివాదాల విషయమై స్వయంగా తనిఖీలు చేప ట్టాలని, రీసర్వే జరుగుతున్న గ్రామాలను అధి కారులు సందర్శించి సమస్యలను పరిష్కరిం చాలని సూచించారు. ఆక్రమణలకు గురైన అటవీ భూముల విషయంలో కోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. నగరవనాల అభివృద్ధి వేగంగా చేపట్టాలన్నారు. ఈ సమవే శంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా, రేంజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం సేవలు బంద్

- చేతులెత్తేసిన నగదు నింపే కాంట్రాక్టర్
- ఏప్రిల్ 1 వరకు డబ్బులకు కటకట



నెల్లూరు (హరనాథపురం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆటోమెటిక్ టెల్లర్ మిషన్ (ఏటీఎం) సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడు తోంది. దాదాపు అన్ని కేంద్రా ల్లోని యంత్రాల్లో కరెన్సీ నోట్లు అయిపోవడమే ఇందుకు కారణమవుతోంది. జిల్లాలో 250కిపైగా ఏటీఎం కేంద్రాలు ఉన్నాయి. జాతీయ బ్యాంకులతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలు కూడా ఉన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇతర జాతీయ బ్యాంకులకు సంబంధించి నగదును నింపే బాధ్యతలను ఏజీఎస్ కంపెనీ అనే సంస్థకు అప్పగించారు. అయితే, కాలపరిమితి ముగియడంతో నెల రోజుల నుంచి ఆ సంస్థ తన కార్యకలాపాలు నిలిపివేసింది. జిల్లావ్యాప్తంగా నగదు అయిపోయిన ఏటీఎం యంత్రాలలోకి తిరిగి కరెన్సీ నింపే వారు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నగదు కోసం ఏటీఎంలకు వెళుతున్న వినియోగదారులు తిరిగి ఊసూరుమని వెనక్కి వస్తున్నారు. బ్యాంకులు ఉన్న భవనాల్లోని ఏటీఎంలను మాత్రం నగదును బ్యాంక్ అధికారులే పర్యవేక్షిస్తుంటారు. దీంతో అక్కడ నగదు పుష్కలంగా అందుబాటులో ఉంది. ఇతర చోట్ల ఏర్పాటు చేసిన ఏటీఎంల అన్నింటిలోనూ కరెన్సీ ఉండటం లేదు. ఈ సమస్య ఈనెలాఖరు వరకు ఉంటుందని బ్యాంకుల వర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరులోగా కొత్త కాంట్రాక్టరును ఏర్పాటు చేసి ఏప్రిల్ 1 నుంచి అన్ని ఏటీఎంలో నగదును అందుబాటులోకి తేవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆరు నెలల చిన్నారికి నోబుల్ వరల్డ్ రికార్డ్

- కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామస్వామిపల్లి గ్రామానికి చెందిన ఆరు నెలల బాలుడు వీర శ్రీయాన్ మేధస్సుకు నోబుల్ వరల్డ్ రికార్డ్స్ వారు సర్టిఫికెట్ అంద చేశారు. ఈమే రకు గురువారం జిల్లా కలెక్టర్ ఆనంద్ తన కార్యాలయంలో చిన్నారి తల్లిదండ్రులకు నోబుల్ సర్టిఫికెట్ అందచేశారు. గ్రామానికి చెందిన చందలూరి వీరు, ఊహ దంపతుల కుమారుడు వీర శ్రీయాన్ వయస్సు ఆరు నెలలు. ఏకసంతాగ్రహి. పలు రకాల కూరగాయలు, పండ్లు, జంతువుల ఫోటోగ్రఫీ ముందు పెడితే వాటిని గుర్తిస్తాడు. దీన్ని గమనించిన బాలుడి తల్లిదండ్రులు ఈ విషయాన్ని నోబుల్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల వారు నిర్వహించిన పరీక్షలో నెగ్గాడు. దీంతో ఆ బాలుడి ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్, మెడల్స్ అందచేశారు. ఈమేరకు నోబుల్ సర్టిఫికెట్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ బాలుడి తల్లిదండ్రులకు అందచేశారు. బాలుడి తల్లిదండ్రులను జిల్లాకలెక్టర్‌తో పాటు పలువురు అభినందించారు.



చిన్నారి తల్లిదండ్రులకు నోబుల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందచేస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

డీఎస్సీ కోచింగ్‌కు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కోచింగ్ సెంటర్ల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి ఓ ప్రకటనలో కోరారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కోచింగ్‌కు అర్హులైన వారు ఈనెల 15లోగా వెబ్ ఆప్షన్ నమోదు చేసుకో వాలని సూచించారు. పూర్తి వివరాలకు 958 1630003 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన జూ.ఇంటర్ పరీక్షలు



యాహూ.. పరీక్షలు అయిపోయాయ్!

నెల్లూరు (విద్య), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రధాన పరీక్షలు గురువారం పూర్తయ్యాయి. ఈ నెల 1న జిల్లాలోని 79కేంద్రాల్లో ప్రారంభమైన పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. ఒకేషనల్, మైనర్ సబ్జెక్ట్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. గురువారం జరిగిన కెమిస్ట్రీ-1, కామర్స్-1, ఒకేషనల్ పరీక్షలకు 27,595 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 27,753 మందికి 792 మంది గైర్హాజరవగా 26,961 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు 738 మందికి 634 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు 5, డీవీఈఓ 3, డీఈసీ 6, ఫ్లైయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్స్ 32 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులు రోడ్లపై కేరింతలు పెడుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మరికొంతమంది అలింగనం చేసుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. ఏడాదిపాటు హాస్టళ్లలో ఉండి చదువుకున్న విద్యార్థులు పరీక్షలు పూర్తవడంతో సొంతూళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ, రైల్వే స్టేషన్‌లకు చేరుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాలన్నీ రద్దీగా కనిపించాయి.



బాలికల కేరింత..



బై.. మళ్లీ వస్తాం..!

17 వాహనాల బహిరంగ వేలం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ అధికారులు తనిఖీల సమయంలో స్వాధీనం చేసుకున్న వాహనాలను వాటి యజమానులు విడిపించుకోకపోవడంతో గురువారం వేలం వేశారు. నగరంలోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో 17 వాహనాలకు బహిరంగ వేలం వేశారు. ఇన్‌చార్జి ఆర్టీవో ఎం బాలమురళీకృష్ణ మాట్లాడుతూ వేలం ద్వారా రూ.1.72 లక్షల ఆదాయం వచ్చిందని, ఆ నగదును సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు.

సముద్రపు ఒడ్డున తవ్వకాలు

- యథేచ్ఛగా రాత్రిళ్లు ఇసుక తరలింపు
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ అధికారులు



హేచరీ నిర్మాణ స్థలంలో చదును చేసిన ఇసుక

ఉలవపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు సముద్రపు ఒడ్డున (చెలియలి కట్టలో) ఉన్న ఇసుకను కూడా వదలడంలేదు. మండలంలోని కరేడు పంచాయతీ పరిధి టెంకాయచెట్లపాలెం ఎదురుగా ఉన్న సముద్ర తీరంలోని ఇసుకను అక్రమార్కులు రాత్రిళ్లు అక్రమంగా తరలిస్తూ భారీగా ధనార్జన సాగిస్తున్నారు. తీరప్రాంతంలో హేచరీల నిర్మాణం కొనసాగుతున్నాయి. వీటి నిర్మాణం చేపట్టే భూములు లోతట్టులో ఉండడంతో మట్టి లేక ఇసుకతో మెరక చేయాల్సిఉంది. ఈ క్రమంలో ఇసుక తరలించేందుకు హేచరీ యాజమాన్యాలు టెంకాయచెట్ల పాలేనికి చెందిన అధికారపార్టీ నాయకులతో ఒప్పందం కుదుర్చుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సముద్రం ఒడ్డుకు, హేచరీ నిర్మాణాలకు 300 మీటర్ల దూరం ఉంది. సముద్రపు ఒడ్డున మేట వేసిన ఇసుకను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి రాత్రిళ్ల ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ. 600 విక్రయిస్తున్నారు. ఈ విషయమై గ్రామంలోని అధికారపార్టీ నాయకుల్లో విభేదాలు తలెత్తడంతో ఓ వర్గం వారు రెవెన్యూ అధికారులకు సమాచార మిచ్చారు. అయినా వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన హేచరీలన్నీ, ఇలా సముద్రపు ఒడ్డు ఉన్న ఇసుకను తరలించాయి.

పట్టించుకోని అధికారులు

సముద్రపు ఒడ్డున సరుగుడు చెట్లు ఆనుకొని ఇసుక తరలిస్తున్నా, అటవీ అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇదంతా ఫారెస్టు, రెవెన్యూ అధికారులకు తెలిసే జరుగుతుందని, వారికి అందాల్సిన ముడుపులు అందుతుండడంతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



టెంకాయచెట్లపాలెం సముద్రం ఒడ్డున ఇసుక కోసం తవ్వకాలు జరపగా ఏర్పడిన గోతులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8343
వెండి కిలో ధర	రూ. 101,200
వెండి ఒక గ్రాము	రూ.104.20

గృహ నిర్మాణాలకు అదనపు నిధులు

విడవలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అసంపూర్తిగా మిగిలిన గృహనిర్మాణాలను పూర్తి చేసేందుకు, కూటమి ప్రభుత్వం అదనంగా నిధులు కేటా యించిందని కోవూరు హౌసింగ్ డీఈ వెంకటే శ్వర్లురెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో అన్నీ వర్గాల పేదలకు ఇంటికి రూ.180 లక్షలను కేటాయించామన్నారు. మండలానికి 690 ఇళ్ల మంజూరు కాగా 90 శాతం మేర కు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. అదనపు కేటాయింపు వల్ల 269 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. అయితే ఈ కేటాయింపులు సొంతంగా ఇళ్ల కట్టు కున్నవారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. జూన్ నెలఖరులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అయన పేర్కొన్నారు.

పేదల భూములకు సర్వే నిర్వహించాలి

విడవలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటుకూరులో భూమి కొనుగోలు పథకం కింద మంజూరు చేసిన 90 ఎకరాల భూమికి సర్వే నిర్వహించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి తెలిపారు. గురువారం ఆయన తహ సీల్దారు చంద్రశేఖర్‌ని కలసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలకు ఇచ్చిన భూములను సర్వే చేసి, వారికి వెంటనే అందచేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్ర మంలో దళిత నాయకులు పల్లం శేషమ్మ, అద్దంకి కార్తీక్, వెంకటేశ్వర్లు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు

రాపూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేతి పంపుల మరమ్మతుల కోసం క్రాష్ ప్రోగ్రాంను ఎంపి డివో భవాని స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఎఈఈ ఆంజనేయులు, టిడిపి నాయకుడు ఖాజా మొహిద్దీన్, చిట్టి టి సురేంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయం నుంచే జనన, మరణ ధ్రువపత్రాలు

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి13(ఆంధ్రజ్యోతి):నగ ర పంచాయతీ పరిధిలోని ప్రజలు ఇక నుంచి సచివాలయాల్లోనే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుందని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి, కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకోసం నగర పంచాయతీలో ప్రజలు నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడేవారని తెలిపారు. ఇక నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు నగరపంచాయతీ లోని సచివాలయాలద్వారానే 3నుంచి 7రోజుల్లోపు అందజేయనున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్ల, స్థలాల పన్ను బకాయిలు ఈనెలాఖరులోపు చెల్లించాలని కోరారు. అలా చెల్లించకుంటే ఏప్రిల్ నుంచి వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరా వేళలను మార్పు చేస్తున్నామన్నారు.ఇక నుంచి ఉదయం 5 నుంచి 8వరకు, సాయంత్రం 5నుంచి 8గంటల వరకు నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తాగునీటిని వృథా చేయకుండా వాడుకోవాలని కోరారు. వీధి కుళాయిల నీటిని వృథా చేయడంవల్ల వాటిని తొలగిస్తున్నట్టు వారు తెలిపారు.



బాలికలకు ఆత్మరక్ష శిక్షణ ఇస్తున్న శిక్షకులు

బాలికలకు ఆత్మరక్ష శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి13(ఆంధ్రజ్యోతి): బాలి కల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసమే రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ కార్యక్రమాన్ని జిల్లావిద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్‌లు సంయు క్తంగా రూపకల్పన చేశాయని శిక్షకులు మన్మథ, శ్రీనివాస్, శ్యామ్ తెలిపారు. గురువారం బుచ్చి రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికలకు రాణి ఈ కార్యక్రమంలో మెలకువలు నేర్పించారు. అపరిచితులు ఎదురైనప్పుడు వ్యవ హరించాల్సిన తీరు, దొంగలు దాడులకు పాల్పడి నప్పుడే తీసకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, రిసోర్సు సభ్యుడు గండికోట సుధీర్, వేదవతి, నిర్మల, బ్రహ్మారెడ్డి, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబడిపాళెంలో ఆర్‌బీఐ సహకారంతో అవార్డ్ స్వచ్ఛంధ సంస్థ అధ్వ ర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవ గాహన నిర్వహించారు. ముఖ్య అతిథు లుగా కెనరా బ్యాంకు ఎఫ్‌ఎల్‌సీ రవిశంకర్, సర్పంచు నిర్మల, సెక్రటరీ స్వేత, వార్డు కౌన్సిలర్ నాగరాజు, గ్రామ పెద్దలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌సీ మాట్లాడు తూ అందరూ ఆర్థిక అక్షరాస్యులుగా ఎదగా లన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యయని తెలిపారు. పొదుపు మహిళలు బ్యాంకు రుణా లను అందిపుచ్చుకుని, అభివృద్ధి చెందాలని సూచించారు. సామాజిక భద్రతా పథకాలైన పీఎంఎస్‌బీవై, పీఎంజేజే బీవై, పీఎంజేడీవై, ఏపీవై, ఎస్‌ఎస్‌వై పథకాలను వినియోగించు కోవాలని తెలిపారు. అవార్డు సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాంకు ఖాతా ల్లో జరిగే మోసాలను వివరించారు. కార్యక్ర మంలో గ్రామ సభ్యులు, మహిళలు, సురేష్, ప్రసాద్, రవీంద్ర, అవార్డు స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధార్ కోసం అవస్థలు..

● డీపీ సెలవుతో తిప్పలు

మనుబోలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ సెంటర్‌లో డిఏ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 14 సచివాలయాలు ఉన్న ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు, నవీకరణ చేయడానికి మనుబోలు సచివాలయం-2కు గ్రామాల నుంచి రావాల్సిందే. అయితే ఆ సచివాల యంలో ఉన్న డిఏ (డిజిటల్ అసిస్టెంటు)కు మాత్రమే ఈ నమోదుపై శిక్షణ ఇచ్చారు. దీంతో మండలంలోని చుట్టుపక్కల గ్రామాల వారంతా మండలకేంద్రానికి రావాలి. అయితే ఇక్కడ పనిచేస్తున్న డిఏ సెలవుపెట్టడం తో కొద్ది రోజులుగా సచివాలయం-2 ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆధార్ సమస్యల పరిష్కారం కోసం మండలవాసు లంతా పక్క జిల్లాలోని గూడూరుకో, నెల్లూరు జిల్లా కేంద్రానికో వెళ్ళాల్సి వస్తోంది. లేదంటే ప్రైవేట్ ఆధార్ కేంద్రంలో వందల రూపాయలు వెచ్చించి చేయిం చుకునే పరిస్థితి నెలకొంది. దీనిపై ఎంపీడీవో జలజాక్షిని వివరణ కోరగా.. డిఏ నెలరోజులు సెలవు పెట్టారన్నారు. ఆధార్ నమోదు ఆమె వేలిముద్రతోనే వస్తుంది. ప్రత్యామ్నాయ మార్గం ప్రస్తుతం లేదు. మరో ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు తర్ఫీదుఇచ్చి, పరీక్ష రాయించేందుకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.



మనుబోలు సచివాలయం-2లో ఖాళీగా ఉన్న డీఏ కుర్చీ

గిరిజనులకు ఆధార్ నమోదు

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు, పేడూరు, చింతోపు, వరకవిపూడి గ్రామాలకు చెందిన సుమారు 80 మంది గిరిజ నులకు పేడూరు సచివాలయంలో గురువారం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామని మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఎంపీ డీవో మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐటీడీఏ పైలట్ ప్రాజెక్టు సహకారంతో గిరిజనులకు ఆధార్ నమోదు చేస్తున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ, ఎంపీడీవో

మే 30లోగా ఇల్లు కట్టుకునే వారికి అదనపు ఆర్థిక సాయం

● గృహనిర్మాణ శాఖ డీఈ జహీరుద్దీన్ అహ్మద్

మనుబోలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు మంజూ రైన లబ్ధిదారులు మే 30వ తేదీ లోగా నిర్మించుకుంటే ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆర్థిక సాయం అందుతుందని గృహనిర్మాణ శాఖ డీఈ జహీరుద్దీన్‌అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఇంజనీరింగ్ అసి స్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లేఅవుట్లలో గాని, స్వంత స్థలాల్లో గాని ఇల్లు కట్టుకునే వారికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అం దించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటికి ఇచ్చే రూ. 1.80 లక్షలు కాకుండా ఎస్టీ లబ్ధిదారులకైతే అదనంగా రూ. 75వేలు, ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50వేలు ఇవ్వనుందన్నారు. అద నపు సాయం కావాలన్న లబ్ధిదారులు కులధృవీకరణ పత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏఈ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎంపీడీవో

● వెంకటాచలం : రాష్ట్ర ప్రభుత్వం ఆదనంగా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పక్కాగృహాలు మంజూరైన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కల్పన గురువారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ దశలలో అసం పూర్తిగా ఉన్న పక్కాఇళ్లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు ఆదనంగా ఇస్తుందన్నారు. ఆర్థిక సహాయాన్ని పొంది త్వరితగతిన పక్కా ఇళ్లను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర

● డ్వామా పీడీ గంగాభవానీ

ముత్తుకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర లభిస్తుం దని, అమ్మకాలు సాగించేలా రైతులను ప్రోత్సహిం చాలని డ్వామా పీడీ గంగాభవానీ సూచిం చారు. మండల కేంద్రమైన ముత్తుకూ రులోని ధాన్యం కనుగోలు కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న అధికారులు సిబ్బందితో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారా, లేదా అని ఆరా తీశారు. మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపరుచుకుని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, వ్యవసాయాధికారి జోత్స్నారాణి, వ్యవసాయ పరపతి సంఘం ఈవో వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవానీ

● మనుబోలు : ధాన్యం కొనుగోలు కేం ద్రాల ద్వారా రైతులకు మద్దతుధర దక్కుతుం దని తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. గురువారం ఆయన మండలంలోని యాచవరం గ్రామంవద్ద కల్లాలకు వెళ్ళి రైతులతో మాట్లా డారు. కేంద్రాలకు ధాన్యం ఇస్తే రెండురోజు ల్లోగా నగదు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి జహీర్, విఆర్‌వోలు శ్రీనువాసులు, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.85లక్షలతో దర్గా ముఖద్వారం పనులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద గురువారం సాయంత్రం రూ.85లక్షలతో స్వాగత ద్వారాల పునఃప్రా రంభ పనులకు శంకస్థాపన జరిగింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కలెక్టర్ ఓ ఆనంద్, నగర కమిషనర్ సూర్యతేజ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ తహసీన్, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొ న్నారు. కోటంరెడ్డి మాట్లా డుతూ ముఖ ద్వారాల పునఃనిర్మాణానికి అడిగిన వెంటనే నిధులు ఇచ్చి పనులు చేపట్టేందుకు కలెక్టర్ సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

హోలీ పేరుతో హద్దులు దాటితే చర్యలు

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పేరుతో హద్దులు దాటి ఇతరుల స్వేచ్ఛకు భంగం కల్గిస్తే చర్యలు తప్పవని ఎస్పీ జీ కృష్ణకాంత్ హెచ్చరించారు. హోలీ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటు న్న భద్రతా చర్యలను గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా నగరం, పట్టణాలు, ప్రధాన కూడళ్లలో 67 పికెట్లు, 41 మొబైల్ పార్టీలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సంతోష వాతావరణంలో పండుగ జరుపుకోవాలని, ఇతరులపై బలవంతంగా రంగులు వేయకుండా మర్యాదపూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. అల్లర్లు, అసత్య ప్రచారాలు, మహిళలను వేధింపులకు గురి చేయడం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుం టారని తెలిపారు. జిల్లా ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధితుడికి యూటీఎఫ్ నేతల ఆర్థిక సాయం

పొదలకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లగా వెన్నె ముక సమస్యతో మంచానికే పరిమితమైన స్థానిక నరసారెడ్డి కాలనీకి చెందిన కూటిపాటి వరప్రసాద్‌కు యూటీఎఫ్ నాయకులు గురువారం ఆర్థిక సాయం అందించారు. యూటీఎఫ్ నాయకులు మిత్రుల ద్వారా సేకరిం చిన రూ.28,500 ఆర్థిక సహాయాన్ని వరప్రసాద్ భార్య రేవతికి అందిం చారు. ఈ కార్యక్రమంలో యూటీ ఎఫ్ మండల శాఖ జనరల్ సెక్రటరీ వై రమేష్, టి హేమంత్, ఎం శ్రీనివాసులు, పీవీ సుబ్బారావు, ఏ సర్వేష్, ఎం అంకిరెడ్డి, ఏ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



రేవతికి ఆర్థికసాయం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మస్థాపన కోసమే ధర్మసంస్థాపనాయ అంతర్జాతీయ పార్టీ

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : దేశంలో అడుగడుగునా ఆవరించి ఉన్న దుర్మార్గాన్ని పారద్రోలి, ధర్మస్థాపన గావించడమే లక్ష్యంగా ధర్మసంస్థాపనాయ అంతర్జాతీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నామని వ్యవస్థాపకుడు బాలాజీ తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగ సమస్య నిర్మూలిస్తామని, వ్యవసా యాన్ని అత్యున్నత వ్యాపార రంగంగా మారుస్తామన్నారు. గ్రామాల్లో నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించడం తమ పార్టీ ఆశయమన్నారు. మంచి ఆశయాలు కలిగిన వారందరూ తమ పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, నళినీ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : పట్టాభి

కొడవలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అన్నారు. మండలంలోని గండవరం లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసు కున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఏగ్రేడ్ రకం ధాన్యం పుట్టికి రూ.19,720 ఇస్తున్నదని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రం అవసరం లేకుండానే, వాట్సాప్ నెంబరు 73373 59375కి వివరాలు పంపితే ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్ మెసేజ్ వస్తుందని తెలిపారు. రైతుల వద్ద దళారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

● బ్రోకరు ఆఫీసుల తనిఖీ

మండలంలోని నార్సురాజుపాలెంలో ఉన్న ధాన్యం కొనుగోలు బ్రోకరు ఆఫీసులను కావలి ఆర్డీవో వంశీకృష్ణ గురువారం ఆకస్మికంగా తని ఖీ చేశారు. అనంతరం ఆయన సచివాలయా న్ని సందర్శించి, రైతులకు ప్రభుత్వం నిర్ణయిం చిన మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ఆయన వెంట అధికారులు, టీడీపీ నాయకులు తువ్వర ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

బుచ్చి ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై విచారణకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ వార్డెన్, వాచ్‌మన్‌లపై కలెక్టర్ ఆనంద్ విచారణకు ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డిప్యూ టీ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసులు గత నవంబరులో ఆ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వార్డెన్ జ్యోతి సునీల్‌కుమార్, వాచ్‌మన్ లపై విద్యార్థులు డీడీకి ఫిర్యాదు చేశారు. మెనూ కూడా సక్రమంగా పాటిం చడం లేదని, వీపులపై వాతలు పడేలా కొడుతున్నారంటూ వాపోయారు. దీంతో ఆయన విద్యార్థుల సమస్యలను నివేదిక రూపంలో కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. ఈ మేరకు వాచ్‌మన్‌ను తొలగించినట్లు సమాచా రం. అయితే, క్రిమినల్ కేసులాంటివి నమోదు చేయకుండా వాచ్‌మన్ పైరవీలు చేయించుకు న్నట్లు తెలిసింది. అయితే, వార్డెన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాగా, ఈ వ్యవహారంపై తాజాగా కలెక్టర్ జిల్లా సెటిల్మెంట్ అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆమె బుధవారం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల నుంచి వివరాలు సేకరిం చారు. నివేదిక ఆధారంగా వార్డెన్, వాచ్‌మన్‌లపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

C.R.I.M.E N.E.W.S

అగ్నిప్రమాదంలో పూరిగుడిసెలు దగ్ధం

● రూ. 4 లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలి బూడిదైన గుడిసెలు, ఆటో

మర్రిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమా దంలో పూరి గుడిసెలు దగ్ధమైన సం ఘటన మండ లంలోని డీసీ పల్లిలో బుధ వారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా నుంచి పొగాకు పని చేసేందుకు వచ్చిన ముఠాకూలీలు రోజూ మాదిరిగా పొలాల్లోకి వెళ్లారు. ఆ సమయంలో అగ్నిప్రమాదం సంభ వించింది. సమాచారం అందుకున్న స్థానిక అగ్నిమాపక కేంద్రం వాహనం వచ్చే సరికే గుడిసెలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అందులోని నిత్యావ సర వస్తువులతోపాటు 4 గ్యాస్ సిలిండర్లు పేలి పోయాయి. ఆ సమ యంలో సమీపంలో ఎవరూ లేనందువల్ల ప్రాణా పాయం తప్పింది. పక్కనే ఉన్న ఆటోతో పాటు ఒక బైక్ కూడా కాలి పోయింది. ఈప్రమా దంలో సుమారు 4లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతు న్నారు. తహసీల్దారు అనిల్‌కుమార్ తమ సొంత నిధులతో వారికి బట్టలు, ప్రతీ కుటుంబానికి 10కేజీల బియ్యం అందిం చారు. ఆత్మ కూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నకిలీ ఎస్ఐ అరెస్ట్

● మోసానికి పాల్పడడంతో కేసు నమోదు : డీఎస్పీ

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సిద్దీపురం గ్రామానికి చెందిన యువకుడు పోలీస్ శాఖలో ఉద్యోగం రాకపోవడంతో నకిలీ ఎస్‌ఐగా చలామణి అవుతూ మోసానికి పాల్పడ డంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వేణుగోపాల్ తెపారు. ఆమేరకు ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో నిందితుడ్ని హాజరు పరిచారు. ఆయన వివరాల మేరకు.. అల్లూరు మండలం లోని నార్త్ ఆములూరుకు చెందిన నన్న హరీష్ అనే యువకుడు నకిలీ ఎస్‌ఐగా అవతారమెత్తి స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో వాహనాలు నిలిపి తనిఖీ చేస్తుండగా సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్‌లు చాకచ క్యంగా అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుడు ధరించిన పోలీస్ యూనిఫారం, బెల్టు, పోలీస్ లోగో టోపీ, ఇతర సామ గ్రిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ వేమారెడ్డిని, ఎస్ఐ రాజేష్‌ను, పోలీస్ సిబ్బందిని అభినందించారు.



నకిలీ ఎస్ఐ గురించి వివరిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అత్త మృతిని తట్టుకోలేక మనస్థాపానికి గురైన ఓ వివాహిత గురువారం జాఫర్‌సాహెబ్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరులోని మనుమసిద్ధినగర్‌లో ఎం వెంకటేశ్వర్లు, సుహాసిని(54) దంపతులు నివసి స్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. వెంకటేశ్వర్లు ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వర్లు తల్లి రంగమ్మ ఈ నెల 4వ తేదీన మృతిచెం దారు. అప్పటి నుంచి సుహాసిని మానసికంగా కృంగిపోతూ అత్తను కలవరిస్తూ ఉండేది. ఈ క్రమంలో గురువారం వెంకటేశ్వర్లు దుకాణానికి వెళ్లగా సుహాసిని ఇంటి నుంచి ఎటో వెళ్లిపో యింది. ఆమె కనిపించడం లేదని కోడలు వెంకటేశ్వర్లుకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆయన తన చిన్న కుమారుడు అజయ్‌తో కలిసి భార్యకోసం గాలింపు చర్యలు చేపట్టారు. పెన్నానది సమీపంలో వెతుకుతుండగా అక్కడ కొందరు జాఫర్‌సాహెబ్ కాలువలో ఓ మహిళ దూకిందని చెప్పారు. దీంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. కాలువలో దూకింది సుహాసినిగా గుర్తించి రామచందారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధితులు గురువారం సాయంత్రం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బాలకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాలు తరలించే వాహనంపై కేసు

సంగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చేపల చెరు వులకు చికెన్ వ్యర్థాలు తరలించే వాహనంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదయింది. ఈనెల 5వ తేదీన సంగం గ్రామానికి చెందిన కాకు మధుసూదన్ అనే రైతు పల్లిపాళెం రహదారిలో మోటారుబైక్‌పై యూరియా బస్తా తీసుకుని వెళ్తుం డగా ఎదురుగా చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం వేగంగా వచ్చి మధుసూదన్‌ను ఢీకొనబోయింది. దీంతో మధుసూదన్ వాహనాన్ని నిలిపి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు విచారించిన పోలీసులు ఆలస్యంగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

రాపూరు, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఈప్రమాదంలో రాపూరు వాసి షేక్ ముక్తార్‌కు తీవ్ర గాయాలు కాగా మెరు గైన చికిత్స కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలిం చారు. ప్రమాదం విషయం తెలు సుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

సీతారామపురం, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికా రులు గురువారం తనిఖీ చేశారు. మద్యం తాగు తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈసంద ర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ దిప్తి ఖారంత్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.





దగ్ధమవుతున్న దుర్గం కొండ

దగ్ధమవుతున్న దుర్గం కొండ

ఉదయగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం కొండ అగ్నికి ఆహుతవుతోంది. ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు ప్రాంతంలో కొండ వెనుకవైపు గురువారం గుర్తుతెలియని వ్యక్తులు పలుచోట్ల నిప్పు పెట్టడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. పొగ, మంటల వ్యాప్తికి పచ్చని చెట్లు దగ్ధమయ్యాయి. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి అడువులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మ్యూజియం చూసొద్దాం!

మరమ్మతుల తర్వాత ముస్తాబైన పురావస్తు ప్రదర్శన శాల

రేపు పునఃప్రారంభం : ఏడీ గంగాధర్

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతీ నగర్‌లో ఉన్న జిల్లా మ్యూజియం కొత్త హంగులతో ముస్తాబైంది. కలెక్టర్‌గా ఆనంద్ బాధ్యతలు తీసుకున్న కొన్ని వారాలలోనే కేంద్ర జిల్లా గ్రంథాలయ భవనాన్ని, నెల్లూరు మ్యూజియంను సందర్శించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనాన్ని వారసత్వ సంపదగా కాపాడుకునేందుకు అవసరమైన మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మ్యూజియం భవనానికీ మరమ్మతులు చేయించాలని నగర పాలక సంస్థ కమిషనర్‌కు సూచించారు.



కొత్త రంగులతో సిద్ధమైన జిల్లా మ్యూజియం

దీంతో సుమారు రూ.8లక్షల నగర పాలక సంస్థ నిధులతో మరమ్మతులు పూర్తి చేశారు. శనివారం దీనిని పునఃప్రారంభించనున్నారు.

ఆది మానవుల జీవితాల నుంచి నేటి వరకు మన చరిత్ర నాగరికత, జీవన శైలి తదితర అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. క్రీస్తు పూర్వం నుంచి ఉన్న వంట పాత్రలు, చక్రవర్తులు, రాజులు, సుల్తానులు ఉపయోగించిన ఆయుధాలు అబ్బురపరుస్తాయి. ఆంగ్లేయుల పాలనలో చెలామణిలో ఉన్న నాణేలను ఇక్కడ చూడవచ్చు. పంచలోహ దేవతా విగ్రహాలు, దారు శిల్పాలు (చెక్క శిల్పాలు), రాగి శాసన ఫలకాలు ఆకట్టుకుంటాయి.

- **ప్రతిరోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు అనుమతి**
- **ప్రతి శుక్రవారం సెలవు దినం**
- **ప్రవేశ రుసుము పెద్దలకు రూ.3, పిల్లలకు రూ.1**
- **ఫొటోలు తీసుకోవాలంటే ఒక్కోదానికి రూ.10 అదనం**



పురాతన వస్తువులు



మ్యూజియం లోపలిభాగం



పంచలోహ విగ్రహాలు



ఈ ఫిరంగి ఎప్పటిదో..!



రక రకాల కత్తులు భలే ఉన్నాయి కదూ..!

సందర్శకులను పెంచేందుకు కృషి

కలెక్టర్, నగర కమిషనర్, రూరల్ ఎమ్మెల్యే కృషితో మ్యూజియంను సుందరంగా తీర్చిదిద్దాం. ఈనెల 15న పునః ప్రారంభిస్తున్నాం. పునః ప్రారంభానికి అందరూ ఆహ్వానితులే. పర్యాటకులతోపాటు నగర ప్రజలు, విద్యార్థులు, ఎక్కువ మంది మ్యూజియంను సందర్శించేలా చర్యలు తీసుకుంటాము.

– జీ గంగాధర్,
జిల్లా పురావస్తు శాఖ
సహాయ సంచాలకుడు

● ఆకస్మిక తనిఖీలో డీఎంఈ అడ్మిన్ డాక్టర్ వెంకటేష్

‘డుమ్మా’ వైద్యులకు షోకాజ్

నెల్లూరు (వైద్యం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీఎంఈ అడ్మిన్ డాక్టర్ వెంకటేష్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొందరు వైద్యులు రోగులకు అందుబాటులో లేకపోవటంతో వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. వైద్యులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని హెచ్చరించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ చర్యలు తీసుకోవాలని, ఇందుకు ఎన్టీఆర్ వైద్యసేవ నిధులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే వివిధ విభాగాల అధిపతులతో మాట్లాడుతూ సమస్యల వివరాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ మస్తాన్ బాషా, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేష్

మౌలిక సదుపాయాలు కల్పించండి

● ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వినతి

జీజీహెచ్‌లో రోగులకు అవసరమైన అన్నీ మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం జీజీహెచ్‌కు వచ్చిన డీఎంఈ అడ్మిన్ డాక్టర్ వెంకటేష్‌కు అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, సభ్యులు మల్లికార్జున, మొగరాల సురేష్, బ్రహ్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆసుపత్రిలోని చాలామటుకు లిఫ్టులు, ఫ్యాన్లు పనిచేయటం లేదన్నారు. ఐసీయూలో ఏసీలు పనిచేయకపోవటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు తగినంత మంది లేక రోగులకు సకాలంలో సేవలు అందించే పరిస్థితి లేదన్నారు. డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ 50 మంది ఎఫ్ఎన్‌వోల నియామకానికి అనుమతులు వచ్చాయని, త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు. ఆసుపత్రిలోని సమస్యలను కూడా పరిష్కరిస్తామని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు.

అబ్బురపరిచిన ‘రత్నం’ వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు(విద్య), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సరస్వతినగర్ లో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం ఉన్నత పాఠశాలలో సైన్స్ చిల్డ్రన్స్ కాంగ్రెస్ పేరుతో శుక్రవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ అబ్బురపరిచింది. సైన్స్ ప్రాజెక్టులను పోస్టర్ ప్రదర్శన, ఇన్నోవేషన్స్, నమూనాలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులు అనే విభాగాలుగా ప్రదర్శించారు. యూనివర్స్ ఇన్ ద పాట్, కార్బన్ ప్యూరిఫికేషన్, హైడ్రాలిక్ క్రేన్ కార్డియాక్ సైకిల్, పిండ దశలు, రాకెట్, సైకిల్ రోబోట్, థెఫ్ట్ అలర్ట్ తదితర నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అతిథిగా హాజరైన సమగ్రశిక్ష ఏఎంవో సుధీర్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పలు ప్రాజెక్టులను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జీఎం రామ్మూర్తి నాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్ సింగ్, ఏవోలు తూహినా, సునీల్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సైన్సు ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆవిర్భావ సభకు తరలిన జనసైనికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు జిల్లా నుంచి జనసైనికులు గురువారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. 250 కార్లు, 35 బస్సుల్లో నగరం లోని ప్రశాంతినగర్ నుంచి కదిలారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణానికి ముందు కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

ఆర్టీసీలో ఆర్వో ప్లాంట్

● ప్రధాన బస్టాండులో ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల తాగునీటి కోసం ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. బస్టాండులో తాగునీటి సమస్యపై ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రచురించిన ప్రత్యేక కథనానికి దాతలు స్పందించారు. నగరంలోని బిగ్ సీ సంస్థ వారు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు బుధవారం పనులు ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా స్వచ్ఛమైన నీటిని చల్లగా అందించేందుకు కూడా దాతలు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

పలు రైళ్లకు అదనపు స్టాపేజీల కొనసాగింపు

విజయవాడ రైల్వేస్టేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు అదనపు స్టాపేజీలను మరో ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా కొనసాగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. 17011 హైదరాబాద్-సిర్పూర్ కాగజ్ నగర్, 17012 సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్, 12713 విజయవాడ-సికింద్రాబాద్, 12714 సికింద్రాబాద్-విజయవాడ, 12706 సికింద్రాబాద్-గుంటూరు, 12705 గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లు ఈ రోజు నుంచి చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 12072 హింగోళిడెక్కన్-ముంబయి సీఎస్ఎన్ టెర్మినస్ అప్ అండ్ డౌన్ రైళ్లు, పర్బారు, సెలులో 20701, సికింద్రాబాద్-తిరుపతి అప్ అండ్ డౌన్ రైలు మిర్యాలగూడలో, 17646 రేపల్లె-సికింద్రాబాద్ రామన్నపేటలో ఆగుతాయి. 12787 నర్సాపూర్-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ 15, 16 తేదీల్లో మహబూబాబాద్‌లో ఆగుతుంది. 17479 పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20న, 17480 తిరుపతి-పూరి ఈ నెల 21న, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఈ నెల 18న, 17482 తిరుపతి-బిలాస్‌పూర్ రైళ్లు ఈ నెల 16న కొవ్వూరు స్టేషన్‌లో ఆగుతాయి. 20896 భువనేశ్వర్-రామేశ్వరం రైలు ఈ నెల 21న, 20895 రామేశ్వరం-భువనేశ్వర్ రైలు ఈ నెల 23న, 12867 హౌరా-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23న, 16583 పుదుచ్చేరి-హౌరా ఈ నెల 19వ తేదీన రాజమండ్రి స్టేషన్‌లో ఆగుతాయి. 16583 యశ్వంత్‌పూర్-లాతూర్ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు, 16584 లాతూర్-యశ్వంత్‌పూర్ ఈ నెల 15న కమలానగర్ స్టేషన్‌లో ఆగుతాయి. 22151 పూణే-ఖాజీపేట ఈ నెల 21న, 22152 ఖాజీపేట-పూణే ఈ నెల 23న మంచిర్యాల స్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

డీడీ రంగనాథబాబుకి ఘనంగా వీడ్కోలు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది కర్నూలుకు బదిలీ అయిన డాక్టర్ వీవీ రంగనాథ బాబుని గురువారం మత్స్యశాఖ సిబ్బంది జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జిల్లాలో దాదాపు 20 నెలలుగా ఏడీగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, జిల్లా సహకార సంఘాల అధ్యక్షుడు కొండూరు పోలిశెట్టి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రంగనాథబాబుని సత్కరిస్తున్న జేడీ నాగేశ్వరరావు మత్స్యశాఖ అధికారులు, సిబ్బంది

నేడు అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న అష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం లక్ష్మీ జయంతి జరుగుతుందని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు నాణేలతో అభిషేకం, 9.30కు లక్ష కుంకుమార్చన, 10.30కు రుద్ర హోమం, 11.30కు అష్టలక్ష్మీ హోమం, రాత్రి 7గంటలకు స్వర్ణ మహాలక్ష్మీకి పల్లకీ సేవ జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

అప్రమత్తంగా లేకపోతే ప్రాణాపాయం

● కిడ్నీ వ్యాధులపై జడ్పీ విద్యార్థులకు అవగాహన

నెల్లూరు (వైద్యం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే ప్రాణాపాయమని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కిడ్నీ వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. గురువారం నగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కిడ్నీ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శరీరానికి అవసరమైన విటమిన్ డీ కిడ్నీలోనే తయారవుతుందన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సాధినేని రాఘవేంద్ర మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులకు ముఖ్య కారణం ఆహారపు అలవాట్లేనన్నారు. జంక్ ఫుడ్, చక్కెర, ఉప్పున్న పదార్థాలు అధికంగా తీసుకోవడం, నొప్పి నివారణ మందులు ఇష్టానుసారంగా వాడటం వల్ల కిడ్నీలు దెబ్బతింటాయన్నారు. ఈ కార్యక్రమానికి దీనికి ముందు నారాయణ ఆసుపత్రిలో ప్రపంచ కిడ్నీ నివారణ దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం జ్యోతిర్మయి, నారాయణ ఆసుపత్రి ఆర్ఐ సుధీర్‌బాబు, నల్లపరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మే 20న ప్రారంభోత్సవాలు’

నెల్లూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజ కవర్గంలో మే 20న భారీ సంఖ్యలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరగబోతున్నాయని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం రూరల్లోని 33, 34, 36 డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఒకేరోజు 105 ప్రాంతాల్లో శంకు స్థాపనలు చేసి చరిత్ర సృష్టించామని, ఆ పనులన్నీ 60 రోజుల్లో పూర్తి చేసి మే 20న ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కాగా, గురుకుల విద్యాలయాలకు చెందిన గోడ పత్రికలను తన కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి నగర పాలక సంస్థ అందించే మంచినీరు శుక్రవారం పలు ప్రాంతాలకు సరఫరా కాదని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఓ ప్రకటనలో తెలిపారు. సరఫరా జరుగుతున్న పైపులైన్లకు మూడు చోట్ల లీకులు ఉన్నందున, వాటికి మరమ్మతు పనులు చేస్తున్నందున అక్కచెరువుపాడు, కిచ్చరగుంట, టిడ్కో ఇళ్లు, బుజబుజ నెల్లూరు, కొత్తూరు 1, 2 బిట్లు, ఇందిరా నగర్, నేతాజీనగర్, రామకోటయ్యనగర్, రాజారెడ్డినగర్; శ్రీలంక కాలనీలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు.

షుగర్, బీపీ ఉంటే కిడ్నీ పరీక్షలు తప్పనిసరి

● ఎనెల్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అలేఖ్య

నెల్లూరు (వైద్యం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మధుమేహం, రక్తపోటుతో బాధపడేవారు తప్పనిసరిగా కిడ్నీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఎనెల్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అలేఖ్య సూచించారు. అంతర్జాతీయ కిడ్నీ వ్యాధుల నివారణ దినం సందర్భంగా నగరంలోని ఆ ఆసుపత్రిలో గురువారం వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలేఖ్య మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో చాలా వరకు మూత్ర సమస్యలు వస్తామన్నారు. ఇలాంటి వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు కిడ్నీ వ్యాధులు రాకుండా చూడొచ్చని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



రోగులకు అవగాహన కలిగిస్తున్న డాక్టర్ అలేఖ్య

అన్నీ వ్యాధులకు కిడ్నీ సమస్యలే కారణం

● అపోలో డాక్టర్లు శ్రీరాం సతీష్, చక్రవర్తి

నెల్లూరు (వైద్యం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : శరీరంలోని రక్తాన్ని వడపోసే కిడ్నీలు దెబ్బతింటే వాటి ప్రభావం శరీరమంతా ఉంటుందని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి వెల్లడించారు. నగరంలోని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 100కి పైగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు చెప్పారు. వారు గురువారం ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక దశలోనే మూత్రపిండాల వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. కిడ్నీ సమస్యలు ఉంటే గుండె పోటుతోపాటు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిడ్నీ వ్యాధుల నిపుణుడు డాక్టర్ మస్తాన్‌వలి, యూనిట్ హెడ్ బాల రాజు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులు శ్రీరాం సతీష్, చక్రవర్తి తదితరులు

నూతన విధానాలపై అవగాహన పెంచుకోండి

● సీడీపీవో లక్ష్మీదేవి

నెల్లూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నూతన విధానాలపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన పెంచుకోవాలని నెల్లూరు సీడీపీవో లక్ష్మీదేవి సూచించారు. రూరల్ పరిధిలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు తన కార్యాలయంలో ఈ నెల 11 నుంచి ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పోషకాహార కేంద్రాలు మాత్రమే కాదని, అభ్యసన కేంద్రాలుగా కూడా పని చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు స్వరూప, నాగలక్ష్మీదేవమ్మ, లక్ష్మీరాజ్యం, కవిత పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మీదేవి

కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొత్తూరు అంబాపురం ప్రాంతంలో ఉన్న శాలివాహన (కుమ్మర) సంక్షేమ భవన్‌లో గురువారం కవయిత్రి మొల్ల విగ్రహ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మొల్ల సాహిత్యంపై డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, డాక్టర్ పెరుగు రామకృష్ణ ప్రసంగించారు. మొల్ల నెల్లూరు జిల్లా గోపవరం గ్రామంలో జన్మించారని, ఆమెకు ఉన్న లోతైన ఆధ్యాత్మిక భావన వల్లనే రామాయణాన్ని వాడుక భాషలో రచించారని తెలిపారు. అలంకారాలు తొలగించి, నైతికత విలువలలో కథా సారాంశాన్ని వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో బెజవాడ ఆదిశేషయ్య, టీ మధుసూదన్‌రావు, మోచర్ల మధు, సీహెచ్ వరప్రసాద్, కోట శ్రీనివాసులు, విశ్రాంత ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఆరంబాకం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి మొల్ల విగ్రహం వద్ద వెంకటప్పయ్య, రామకృష్ణ

జీజీహెచ్‌లో గుర్తు తెలియని మృతదేహం

● పొద్దున్నుంచి అక్కడే..! ● పట్టించుకోని వైద్యులు, సిబ్బంది

నెల్లూరు (వైద్యం), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడి మృత దేహం గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అలాగే పడి ఉంది. ఇక్కడ క్యాజువాలిటీ భవనం ఆర్వో ప్లాంట్ ముందు భాగంలోనే ఈ మృతదేహం ఉన్నప్పటికీ వైద్యులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. దీనిపై ఆసుపత్రి అధికారులను వివరణ కోరగా పోలీసులకు తెలియచేశామని వారు రాలేదని చెప్పారు. కాగా, బుధవారం రాత్రే ఆ వృద్ధుడు మృతి చెందాడని ఇతర రోగుల సహాయకులు చెబుతున్నారు. పోలీసులు, అధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరం ఉంది.

తెప్పపై ఆశీనులై..

ఏడుమార్లు పుష్కరిణి చుట్టిన ఏడుకొండల స్వామి





తిరుమలలో ఐదురోజుల పాటు జరిగిన వార్షిక తెప్పోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడుకొండల స్వామి పుష్కరిణిలో తెప్పపై ఆశీనులై ఏడుమార్లు విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో అప్పటికే సిద్ధంగా ఉంచిన తెప్పలో కొలువుదీర్చారు. విశేషంగా అలంకరించిన తెప్పపై ఉత్సమూర్తులను ఏడుమార్లు తిప్పారు. చల్లని వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, అన్నమయ్య కీర్తనల నడుమ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. చివరిరోజు కావడంతో పాటు శుక్రవారం పౌర్ణమి గరుడసేవ, రామకృష్ణతీర్థ ముక్కోటి కూడా ఉండటంతో భక్తులు భారీ సంఖ్యలో తెప్పోత్సవంలో పాల్గొన్నారు. దీంతో స్వామి పుష్కరిణి చివరి రోజు భక్తులతో కళకళలాడింది.

ఉత్సవర్లను దర్శించుకున్న జస్టిస్ ఎస్వీఎన్ భట్టి



శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి తెప్పోత్సవాల్లో పాల్గొన్నారు. తెప్పోత్సవాల గురించి అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన కుటుంబ సమేతంగా పుష్కరిణికి చేరుకుని తెప్పపై కొలువుదీరిన ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఆ తర్వాత పుష్కరిణిలో విహరించిన తెప్పను వీక్షించారు. జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఖాతాదారుల నగలు తనఖా పెట్టిన

బ్యాంకు డిప్యూటీ మేనేజర్ అరెస్టు



వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఐ మురళి

సత్యవేడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నాగలాపురం యూనియన్ బ్యాంకులో ఖాతాదారుల నగలను కాజేసి రూ.2.35 కోట్లకు తనఖా పెట్టిన డిప్యూటీ మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం సత్యవేడులో సీఐ మురళి మీడియాకు వివరించారు. 'నాగలాపురంలోని యూనియన్ బ్యాంకులో 2024 మే నుంచి 2025 ఫిబ్రవరి 10వ తేదీ వరకు బంగారు నగలపై రుణాలు పొందిన 67 మంది ఖాతాదారులకు సంబంధించిన రెండున్నర కిలోల నగలను డిప్యూటీ మేనేజర్ ఆరవ సూర్యతేజ్ లాకర్ల నుంచి ఎత్తుకెళ్లాడు.ఇందులో 30మంది ఖాతాదారుల నగలను కుదువ అంగళ్ళు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో తనఖా పెట్టి రూ.1.04 కోట్లు తీసుకున్నాడు. మరో 37మంది ఖాతాదారుల నగలను అదే బ్యాంకు(నాగలాపురం యూనియన్ బ్యాంకు)లోనే 11 మంది బినామీ పేర్లపై రొటేషన్ పద్ధతిలో మార్చుకుంటూ కుదువ పెట్టి రూ.1.31 కోట్లు తీసుకున్నాడు. ఇలా కాజేసిన నగలను తనఖా పెట్ట రూ.2.35 కోట్లు కాజేశాడు. ఇటీవల బ్యాంకులో జరిగిన ఆడిట్‌లో ఈ ఘరానా మోసం వెలుగు చూసింది. విచారణ జరిపిన అధికారుల బృందం ఖాతాదారులు తమ అవసరాల నిమిత్తం బ్యాంకులో తనఖా పెట్టిన నగలను బ్యాంకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ దొంగతనం చేసినట్లు నిర్ధారించారు. యూనియన్ బ్యాంకు తిరుపతి రీజియన్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌తో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న బ్యాంకు మేనేజరు తిరైవరాజ్‌పై నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో గత నెల 20న కేసు నమోదైంది' అని సీఐ వివరించారు. సత్యవేడు సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌ను నాగలాపురం హైవే సమీపంలోని ఆర్చి వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ తిరైవరాజ్ పరారీలో ఉన్నారు. ఇతడి కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు. సమావేశంలో నాగలాపురం ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, బ్యాంకులో ఘరానా మోసానికి పాల్పడిన సూర్యతేజ్ ఆ డబ్బులను ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నట్లు తెలిసింది. ఆయన నుంచి నగలను తాకట్టు పెట్టిన పలు రసీదులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హరియాణా టూ తిరుపతి

- వయా ఢిల్లీ -



స్వాధీనం చేసుకున్న హరియాణా మద్యంతో ఎక్సైజ్ అధికారులు

- ఎన్నో ఏళ్లుగా మద్యం అక్రమ రవాణా.. విక్రయాలు
- రూ.1.28 లక్షల మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు
- మూలాలపై ఆరా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 13(ఆంధ్రజ్యోతి): హరియాణా నుంచి ఢిల్లీ మీదుగా గూడూరు, తిరుపతికి తీసుకొచ్చి కొన్నేళ్లుగా సాగిస్తున్న అమ్మకాల గుట్టు రట్టయింది. ఈ కేసులో హరియాణాకు చెందిన.. ప్రస్తుతం తిరుపతిలో ఉంటున్న ప్రధాన సూత్రధారి గజేంద్ర శర్మను, దీనికి ఆర్థిక సహకారం అందిస్తున్న సి.బాబును ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.28 లక్షల విలువ చేసే 109 హరియాణా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్ గురువారం తిరుపతిలో మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. హరియాణాకు చెందిన గజేంద్రశర్మ తిరుపతి స్కావెంజర్స్ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఆయుర్వేద మందులు అమ్ముతున్నాడు. ఈ క్రమంలో హరియాణా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తీసుకొచ్చి అమ్మడంపై దృష్టి పెట్టాడు. ఎందుకంటే.. ఇక్కడికి, అక్కడికి బాటిల్‌పై దాదాపు రూ.700 వ్యత్యాసం ఉంది. దీంతో తొలి రోజుల్లో ప్రతి నెలా హరియాణా నుంచి మద్యం సీసాలను ట్రావెల్స్ బ్యాగులో పెట్టుకుని ఢిల్లీకి.. అక్కడ్నుంచి రైళ్లలో గూడూరుకు చేర్చేవాడు. అక్కడ ట్రావెల్స్, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లతో పరిచయాలు పెంచుకుని వారి ద్వారా విక్రయించేవాడు. ఈ ఆదాయం రూ.లక్షల్లో ఉండటంతో కొంత మంది మధ్యవర్తులను నియమించుకుని వ్యాపారాన్ని విస్తరించాడు. అదే సమయంలో తిరుపతి నగరం తాతయ్యగుంటలో కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తున్న సి.బాబుతో పరిచయం పెంచుకుని.. హరియాణా మద్యం అక్రమ విక్రయాలను తిరుపతిలోనూ మొదలు పెట్టాడు. ఇందులో మంచి లాభాలు రావడంతో బాబు కూడా అవసరమైన పెట్టుబడి పెట్టాడు. తన దుకాణంలో సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు చేస్తూ వచ్చాడు.

గుట్టు రట్టయిందిలా..

హరియాణా నుంచి తెచ్చిన మద్యాన్ని నాయుడుపేటలో విక్రించడానికి ఓ మద్యం దుకాణం వద్దకు గజేంద్రశర్మ వెళ్లాడు. తన వద్ద హరియాణాకు చెందిన మిలటరీ మద్యం ఉందని కొనుగోలు చేస్తామంటే తీసుకొస్తానని దుకాణ సూపర్‌వైజర్‌తో చెప్పాడు. దీనిపై అనుమానం వచ్చిన అతడు.. నాయుడుపేట ఎక్సైజ్ సీఐ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే జిల్లా ఎక్సైజ్ అధికారులు వాసుదేవ చౌదరి, నరసనాయుడు, శ్యామ్‌కుమార్, టాస్క్‌ఫోర్సు ఎస్ఐ స్వామినాధన్, అర్బన్ సీఐ రామచంద్ర, అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. తమకు హరియాణా మద్యం కావాలంటూ ఫోనులో గజేంద్రశర్మతో మాట్లాడారు. దీంతో గురువారం అతడు వివిధ బ్రాండ్లకు సంబంధించి 109 బాటిళ్ల హరియాణా మద్యం తీసుకురాగా అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతికి చెందిన కూల్‌డ్రింక్ దుకాణం యజమాని బాబునూ అరెస్టు చేశారు. వారి నుంచి 12 ఖాళీ బాటిళ్లతో పాటు దాదాపు రూ.1,28,600 విలువ చేసే మద్యం సీజ్ చేశారు. ఈ కేసులో పాత్రధారి తిరుపతికి చెందిన కారు డ్రైవర్ చల్లా శ్రీనివాస రెడ్డి కోసం గాలిస్తున్నారు.

ఒంటరి వృద్ధభక్తులే టార్గెట్

- మత్తు మందిచ్చి దోచుకుంటున్న ఇద్దరి అరెస్ట్

తిరుమల, మార్చి13(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వచ్చే వృద్ధ భక్తులను టార్గెట్ చేస్తూ.. మత్తు ముందు ఇచ్చి దోచుకుంటున్న ఇద్దరిని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. వివరాల మేరకు.. ఈ ఏడాది జనవరి 5వ తేదీన ఓ భక్తురాలు తన సొత్తును ఎవరు దోచుకెళ్లారంటూ తిరుమల టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. శ్రీవారి ఆలయ తూర్పుమాడవీధిలోని గ్యాలరీ కూర్చుని ఉన్న తనకు దర్శనం చేయిస్తామని నమ్మించి మత్తు మాత్రలు ఇచ్చి తాళిబొట్టు చైన్, చెవి దిద్దులు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ మొదలుపెట్టారు. కొందరు అనుమానితుల వీడియోలు, ఫొటోలతో తమిళనాడులోని ప్రధాన నగరాల్లో గాలించారు. పోలీస్ స్టేషన్లు, క్రైం బ్యూరోలను సందర్శించి ఫొటోలు, వీడియోలతో ఆరా తీయగా, భక్తురాలిని దోచుకున్నవారు తమిళనాడులోని విల్లుపురానికి చెందిన విజయ్‌కుమార్, అతడి పిన్ని శారదగా తేలింది. ఆలయాలకు వెళ్లే ఒంటరి వృద్ధ భక్తులను టార్గెట్ చేసుకుని వారికి మాయ మాటలు చెప్పి దగ్గరై ఆ తర్వాత ఆహారంలో నిద్ర మాత్రలు ఇస్తారు. భక్తులు మత్తులోకి వెళ్లిన తర్వాత వారి శరీరంపై ఉండే బంగారు వస్తువులను దోచుకెళుతున్నట్టు తేలింది.వీరిపై ఇప్పటికే తమిళనాడులో చాలా కేసులు ఉండటంతో పాటు జైలు శిక్షలు అనుభవించినట్టు తిరుమల పోలీసుల విచారణలో తేలింది. ఎప్పటికప్పుడు పేర్లు, చిరునామాలు, ఫోన్ నెంబర్లు మారుస్తూ ఇతర నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. తమిళనాడులోని మూడుజిల్లాల పోలీసులు వీరికోసం గాలిస్తున్న క్రమంలో ప్రత్యేక నిఘాతో తిరుమల పోలీసులు కాంచీపురంలో విజయకుమార్, శారదను గురువారం పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి 21 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.45 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, 6 మత్తు మాత్రలు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం) : 6.26

సహరి (శనివారం) : 5.02

'మామండూరు'ను సుందరంగా తీర్చిదిద్దుతాం



మామండూరు అటవీ ప్రాంతంను సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మామండూరు పర్యాటక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దతామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పేర్కొన్నారు. మామండూరు అటవీ ప్రాంతంలోని పలు ప్రదేశాలను గురువారం ఆయన సందర్శించారు. శేషాచలం బయోస్పియర్ రిజర్వులోని శ్యామల వ్యాలీలోని మామండూరు కమ్యూనిటీ బేసిడ్ టూరిజంను ఏర్పాటు చేశారన్నారు. వందేళ్ల కిందటే అటవీ శాఖ భవనాలు ఉన్నాయని, ఈ అడవులలో 80కి పైగా చిరుతపులులు, ఏనుగులు, అరుదైన 40 పక్షి జాతులు ఉన్నాయన్నారు. నెలకు ఆరేడు వేల మంది ఈ పర్యాటక ప్రాంతాన్ని సందర్శిస్తున్నట్లు తెలిపారు. వీరికోసం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అటవీ శాఖ అధికారులు సఫారీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, వాచ్ టవర్, సరస్సులు చాలా అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రేణిగుంట తహసీల్దారు సురేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాస రావు, ఎంపిడివో విష్ణు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'విరించి'



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన విరించి-2కె25 కార్యక్రమం గురువారం ముగిసింది. రెండు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 912 మంది విద్యార్థులు రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. క్లూ ఛేజర్స్‌లో 509 మంది, మిస్ విరించిలో 40 మంది, ప్రావర్బ్స్ రిడిల్స్‌లో 115 మంది, నాట్యంలో 65 మందితో పాటు ఇతర పోటీల్లో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సంపద సృష్టికే చెత్తతో సంపద తయారీ కేంద్రాలు

బాలాయపల్లి, మార్చి 13: సంపద సృష్టించి పంచాయతీలు నిధులు సమకూర్చుకునేందుకు చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నిండలి, అలిమిలి, బాలాయపల్లి, వెంగమాంబపురం, కయ్యూరు, కాట్రగుంట, కామకూరు, సిద్దాగుంట, హస్తకావేరి, జయంపు గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాల్లో వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానపాములతో ఎరువులు తయారుచేసి విక్రయించ ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ రవి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌టెక్నీషియన్ సేవలు ప్రశంసనీయం



ల్యాబ్‌టెక్నీషియన్లను సన్మానిస్తున్న ప్రగతిసేవా సంస్థ సభ్యులు

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్యవిభాగంలో ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు ప్రశంసనీయమని ప్రగతిసేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ల్యాబ్‌టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో పని చేస్తున్న ల్యాబ్‌టెక్నీషియన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, డాక్టర్ రవికుమార్, కమల్‌రాజా, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దీపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవిలక్ష్మి

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి దీపిక ఎంపిక కావడం సంతోషమని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవిలక్ష్మి అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన దీపికను గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలోని పులివెందులలో జరగనున్న పోటీలలో దీపిక పాల్గొంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, లత పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థినులకు పరీక్షాసామగ్రిని అందజేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో అరవ వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ అరవ పార్వతయ్య, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి



ముత్యాలపాడులో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిల్లకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు తప్పనిసరిగా మమోగ్రామ్, పాప్‌స్మియర్ వంటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ షాలోమ్‌ఆరాఫత్ అన్నారు. గురువారం మండలంలోని ముత్యాలపాడు, కడివేడు గ్రామాల్లో స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చైతన్యభాను, పద్మావతి, సూపర్‌వైజర్లు రవికుమార్, మునిలక్ష్మి, సర్పంచులు వెంకటమ్మ, హరిత, పంచాయతీ కార్యదర్శులు ఆలీబాషా, రమాదేవి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు



ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయశ్రీ

వెంకటగిరిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వినియోగంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ తెలియ జేశారు. గురువారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరు వుల పంటలతో ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర, నాగూర్ బాషా, నాగార్జునరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

60 కిలోల ప్లాస్టిక్ సంచుల స్వాధీనం

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మున్సిపాలిటీ అధికారులు గురువారం రాత్రి ఆకస్మికంగా పలు దుకాణాల్లో దాడులుచేసి 60 కిలోల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకొన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దుకాణాల్లో దాడులు చేశారు. 120 మైక్రాన్స్‌లోపు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్న దుకాణదారుల వద్ద నుంచి వాటిని స్వాధీనం చేసుకొని రూ.వెయ్యి జరిమాన విధించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగిస్తే భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇంటి యజమానులు, దుకాణదారులు చెత్తను రోడ్డుపై వేయకుండా చెత్తబుట్టల్లోనే వేయాలన్నారు. ఆహార పదార్థాలను తయారీ, విక్రయాలు చేసేవారు శుభ్రమైన ప్రదేశాల్లో చేయాలన్నారు. నిబంధనలు పాటించకుంటే నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, శానిటరీ కార్యదర్శులు, మేస్త్రీలు, బిల్ కలెక్టర్లు ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి

- శాసనసభలో ఎమ్మెల్యే విజయశ్రీ విజ్ఞప్తి



తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట నియోజకవర్గంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విన్నవించారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 4,420 టిడ్కో ఇళ్లు 2018 చివరినాటికి 90శాతం పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 10శాతం పనులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో ఆ ఇళ్లు అలాగే ఉండిపోయాయన్నారు. మౌలిక వసతులను కల్పించి వాటిని త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత మంత్రికి ఆమె విన్నవించారు.

మహాలక్ష్మికి హోమపూజలు

గూడూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో గురువారం మహాలక్ష్మి అమ్మవారి జయంతి సందర్భంగా హోమపూజలు నిర్వహించారు. నిర్వాహకుడు కోట సునీల్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బస్సును ఢీకొన్న కారు ఒకరికి స్వల్ప గాయాలు



వెంకటగిరిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా కారు అదుపుతప్పి బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం చక్రంపేట గ్రామానికి చెందిన బి.మునికృష్ణయ్య చెన్నై నుంచి వెంకటగిరి మీదుగా కారులో వారి స్వగ్రామానికి వెళ్తున్నాడు. పట్టణంలోని నాయుడు పేట రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ మలుపు వద్ద మేనకూరు సెజ్‌కు చెందిన గ్రీన్‌టెక్ బస్సు ఎదురుగా వచ్చింది. ఉదయం పొగ మంచు ఎక్కువగా ఉండడంతో అదుపు తప్పి ఆ బస్సును ఢీకొన్నాడు. దీంతో మునికృష్ణయ్య తలకు స్వల్పగాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జంతుశాస్త్ర విభాగ అధిపతి శ్రీనివాసులు, పక్కనే ప్రిన్సిపాల్ శంకర్ శర్మ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకం అని సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.

నేత్రదానం



అనసూయమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ద్వారా నేత్రదానం చేసిన వారి సంఖ్య గురువారం 458కి చేరింది. సూళ్లూరుపేట బాపూజీవీధికి చెందిన సోమిశెట్టి అనసూయమ్మ (89) మరణాంతరం ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో చెన్నై శంకరనేత్రాలయకు నేత్రదానం చేశారు. దీంతో నేత్రదాతలు 458 అయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, సాయిరాం తదితరులు ఉన్నారు.

పిఠాపురం తరలిన జనసైనికులు

వెంకటగిరి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వెంకటగిరి నుంచి పెద్ద ఎత్తున జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పిఠాపురం తరలివెళ్లారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో మొదట గ్రామ శక్తి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత విశ్వోదయ గ్రౌండ్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన బస్సులు, కార్లలో ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధమ్మ, చిరంజీవులు, డక్కిలి సాయి, మనోహరు, మధు తదితరులు ఉన్నారు.



గూడూరు: పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ సభకు స్థానిక గమళ్లపాళెంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, మోహన్, భాస్కర్, క్రాంతికుమార్, సాయికిరణ్, వంశీ, కుమార్, కార్తీక్, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇరువర్గాల దాడిలో ఇద్దరు గాయపడ్డారు. కాలనీ సమీపంలో చెత్తకుండీల మధ్య ఏర్పడిన వివాదంలో ఇరువర్గాలు కర్రలు, కత్తులతో దాడిచేసుకున్నారు. ఈ దాడిలో రవి, రామనారాయణ తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గాయపడిన వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గాయపడిన వెంకటయ్య గురువారం రాత్రి ఆస్పత్రిలో మృతిచెందాడు.

పేట బస్టాండ్‌లో సమస్యల హోల్ట్.. !

- వసతులు కరువు
- అవస్థల్లో ప్రయాణికులు





శ్లాబ్ నుంచి ఊడిపడుతున్న సిమెంటు పెచ్చులు, బస్టాండ్ లోపలికి వచ్చిన ప్రైవేట్ వాహనాలు

నాయుడుపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల హోల్ట్ నానాటికీ అధికమైపోతోంది. ఓజిలి, చిట్టమూరు, పెళ్లకూరు, దొరవారిసత్రం, కోట మండలాలతో పాటు మహానగరాలకు కూడా కూడలి ప్రాంతం కావడంతో ప్రయాణికుల రద్దీ ఇక్కడ అధికంగా ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ బస్టాండ్ అధ్వానంగా ఉంది. పైభాగ పెచ్చులు ఊడిపోయింది. ఇక ప్రయాణికులు కూర్చోవడానికి సరైన కుర్చీలు లేవు. ఉన్నవి చాలావరకు విరిగిపోయాయి. ఇక మరుగుదొడ్లు కాస్త దూరంగా బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. బస్టాండులో ఉండేవారు దుర్గంధం భరించలేక ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. మరుగుదొడ్లలో సరైన నీటి వసతి లేదు. శుభ్రత అనే పూర్తిగా కనిపించదు. ఇక ప్రైవేటు వాహనదారులు బస్టాండు ఆవరణలోకి వచ్చి ప్రయాణికులను తరలిస్తున్నా, ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్నా పట్టించుకునేవారు లేదు. పట్టించుకోవాల్సిన డిపో మేనేజర్లు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఈ బస్టాండు ఎవరి పరిధో తేల్చుకోవడంలోనే వాకాడు, గూడూరు డిపోల మేనేజర్లు ఉన్నారు. దీంతో నాయుడుపేట బస్టాండు అధ్వానంగా మారిపోయింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండు ఏ డిపో పరిధిలోకి వస్తుందో తేల్చి సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎన్ఎంయూ



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూ నాయకులు కోరారు. గురువారం ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు రెడ్ రిబ్బన్‌లు ధరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డిపో నుంచి తిరుమలకు, బెంగళూరుకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆర్టీసీ ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకువచ్చినా ఇప్పటివరకు డిపో మేనేజర్ నోట్‌ఫైల్‌ను సిద్ధం చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. డిపో సిబ్బందికి రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా కండక్టర్లకు చైల్డ్‌కేర్ సెలవులు ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, ప్రవీణ్, శ్రీనివాసులు, గౌస్, కృష్ణ, రమేష్, సుధాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న ఎంఎం పద్మజ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేటి ప్రపంచంలో పురుషులతో సమానంగా పోటీపడి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రామలింగ చౌడేశ్వరిదేవి మహిళా సేవాసమితి గౌరవ అధ్యక్షురాలు మన్నెముద్దు పద్మజ అన్నారు. గురువారు పట్టణంలోని పార్కువీధిలో ఉన్న దేవాంగుల సంఘం కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. ముందుగా మున్సిపాలిటీలో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామలింగ చౌడేశ్వరి దేవి మహిళా సేవాసమితి కార్యదర్శి బండారి శారద, విజయలక్ష్మి, త్రివేణి, కృష్ణవేణి, చంద్రలక్ష్మి, శైలజ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

20.40 లక్షల చేపపిల్లల పంపిణీ

- సొసైటీ చెరువులకు ఉచితంగా అందజేత
- గూడూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు




ఓజిలి పెద్దచెరువులో చేప పిల్లలు వదులుతున్న ఫిషరీస్ అసిస్టెంట్ పుష్పరాజ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్‌రావు, సొసైటీ సభ్యులు

ఓజిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గూడూరు డివిజన్ మత్స్యశాఖ పరిధిలోని ఓజిలి, ఇనుగుంట (ఓజిలి మండలం), జీలపాటూరు (పెళ్లకూరు మండలం)తోపాటు చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలో 25 సొసైటీ చెరువులకు 20.40 లక్షల చేప పిల్లలను ఉచితగా అందజేసినట్లు ఆ శాఖ గూడూరు డివిజన్ అభివృద్ధి అధికారి రఘుబాబు తెలిపారు. ఓజిలిలోని పెద్దచెరువులో చేప పిల్లలను వదిలేందుకు గురువారం 90 వేల చేప పిల్లలను చేపల సొసైటీ సభ్యులకు ఉచితంగా అందజేశారు. ఆశాఖ సహాయకుడు పుష్పరాజ్ అధ్వర్యంలో సొసైటీ సభ్యులు స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు చేతుల మీదుగా వాటిని చెరువులో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్రమణ్యం, ఆయకట్టు అధ్యక్షులు షేక్ ఆయోషా, ఉపాధ్యక్షులు ముమ్మడి శ్రీనివాసులు, నాయకులు షేక్‌రఫీ, జయచంద్రారెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ● మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రఘుబాబు ఫోన్‌లో మాట్లాడుతూ మండలంలోని ఇనుగుంట చేపల సొసైటీకి కూడా లక్ష చేప పిల్లలను అందజేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని చేపల సొసైటీల నుంచి ప్రతిపాదనలు రాలేదని అవి వచ్చిన తరువాత అన్ని సొసైటీలకు చేపపిల్లలు అందజేస్తామని తెలిపారు.

పనిభారం తగ్గించండి.. పంచాయతీ కార్యదర్శుల వినతి

తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొద్ది నెలలుగా వివిధ రకాల సర్వేలతో పనిభారం ఎక్కువై సతమతమవుతున్నామని పనిభారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో విజయకుమార్‌కు విన్నవించారు. గురువారం ఎంపీడీవోతో సమావేశమై పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంలోని వివిధశాఖల కార్యదర్శులను సర్వేలకు ఉపయోగించుకోవాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించినా రెవెన్యూ, వ్యవసాయ, ఆరోగ్య, వెటర్నటీ, సర్వేశాఖల సిబ్బంది సహకరించడం లేదన్నారు. వారి మాతృశాఖకు సంబంధించిన పని ఒత్తిడి ఉందనే సాకుతో తమ సర్వేలలో పాలుపంచుకోవడం లేదని పేర్కొన్నారు. సచివాలయానికి సంబంధించిన అన్నిశాఖల సిబ్బంది ఈ సర్వేలలో పాలు పంచుకునేలా చర్యలు చేపట్టి తమకు పనిభారం తగ్గించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించినవారిలో పంచాయతీ కార్యదర్శులు శేషారావు, శ్రీనివాసరావు, మస్తానయ్య, తదితరులు ఉన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడి పుట్టినరోజు



గూడూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం టీటీడీ పాలకమండలి సభ్యుడు, టీడీపీ నాయిబ్రాహ్మణ సాధికారసమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారామ్ పుట్టినరోజు వేడుకలను నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. కేక్‌కట్‌చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గోపాల్, శ్రీనివాసులు, ప్రతాప్, మస్తాన్, గురునాధం పాల్గొన్నారు.

కుంగిపోయిన కల్వర్టు..

ఒరిగిన ధాన్యం బస్తాల ట్రాక్టర్



ముమ్మారెడ్డిగుంట కల్వర్టు వద్ద ఏర్పడిన గొయ్యి



వాలిపోయిన ధాన్యపు బస్తాల ట్రాక్టర్

పెళ్లకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనేటిరాజుపాళెం నుంచి పాలచ్చూరు, అనకవోలు, పెరుమాళ్లపల్లి, కలవకూరు, ముమ్మారెడ్డి గుంట గ్రామాల మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. ఈ రోడ్డుపై ముమ్మారెడ్డిగుంట వద్ద నిర్మించిన కల్వర్ట్ కుంగి గొయ్యిలు ఏర్పడ్డాయి. ఈ గొయ్యిలో వాహనదారులు బోల్తాపడి ప్రమాదాలకు గురవుతున్నారు. గురువారం ముమ్మారెడ్డిగుంట వద్ద ఓ వరి ధాన్యం బస్తాలతో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పింది. బస్తాలు కిందపడిపోయాయి. పెళ్లకూరు, నాయుడుపేట, బాలాయపల్లి, తొట్టంబేడు, పెళ్లకూరు మండలాలతో పాటు మేనకూరు సెజ్‌కు ఇదే ప్రధాన రహదారి. ఈ దారిలోని కల్వర్టు రక్షణ గోడలు చాలాకాలం క్రితమే కూలిపోయాయి. ప్రధాన రహదారిలో గొయ్యిలు ఏర్పడినా సంబంధిత అధికారులు కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కమనీయం వేణుగోపాలుడి కల్యాణం





కల్యాణవేదికపై కొలువుదీరిని స్వామివారు, అమ్మవార్లు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సూళ్లూరుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడులో వెలసిన సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామ గోదా సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం ఏర్పాటు చేసి స్వామివారి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేద పండితులు, మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వసంతోత్సవం కనులపండువగా నిర్వహించారు. రాత్రి గజవాహనం పై స్వామివారు గ్రామవీధుల్లో ఊరేగారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సెల్వస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

కార్పొరేషన్ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు

తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల కార్పొరేషన్లకు సంబంధించి ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ఈ ఇంటర్వ్యూలకు 252 మంది హాజరుకాగా 21 మంది గైరుహాజరయ్యారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, బ్యాంక్ మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు బీవీపాళెం పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

తడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బీవీపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మురళీ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో వివిధ లైన్‌ల మార్పు, మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిఠాపురం బయలుదేరిన జనసేన నాయకులు



కోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవాలకు కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు కోట నుంచి రెండు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లంబాబు, హరీష్, గూడూరు కృష్ణ, కోటేశ్వరరావు, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

పైపులైన్ల ధ్వంసం అధికారుల పరిశీలన

కోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద సాగరమాల రోడ్డు పనుల విస్తరణలో పైపులైన్లు ధ్వంసం కావడంతో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంద ర్శించారు. పగిలిన పైపు లైన్‌లను యుద్ధప్రాతిపదికన బాగుచేయించి నెల్లూరుపల్లి, కొత్తపాళెం గ్రామా లకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుం టున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్, జేఈ అరవింద్ తెలిపారు.

పశువైద్యశాలలకు మందుల పంపిణీ

కోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కోటలోని పశువైద్యశాల ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఏడీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రభుత్వం సరఫరా చేసిన మందులను పంపిణీ చేశారు. కోట, చిల్లకూరు మండలాల్లోని 12 పశువైద్యశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన జనరల్ మందులను ఆయా పశువైద్యశాలల సిబ్బందికి అందజేశారు.